ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
10 జూలై, 2011

ENTERED

ప్లాస్టిక్ వద్దు!

హ్యాపీ బర్త్‌డే

(2011 జూలై 10 నుంచి
2011 జూలై 16 వరకు)

నమజ్ఞ
5సం॥, జులై-14
శ్యామల-పెద్దన్న
కర్నూలు

షేక్ యాసిన్ బాషా
7సం॥, జులై-2004
జాన్‌సైదా-కరిమూన్
ప్రత్తిపాడు-గుంటూరు

జి.నందీశ్వర్
5సం॥, జులై-2006
పద్మ-నర్సింహులు
హనుమాన్‌నగర్-హైదరాబాద్

ఎ.సారథి
1సం॥, జులై-2010
సుజాత-రాజ్‌కుమార్
మంగళగిరి-గుంటూరు

ఆర్.శ్రీవల్లి
2సం॥, జులై-2009
స్రవంతి-శ్రీనివాస్
కానూరు-విజయవాడ

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి అన్నట్టు <u>కలర్ ఫొటో</u> జత చేయడం మరువకండి. అయితే మీ చిన్నారి ఫొటో వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

ENTERED

మనలో మాట

బిలియనీర్ దేవుడు!



కోట్లకు పడగలెత్తుతున్న కొంతమంది భారతీయ బడా బాబుల్లాగానే- మరో ధనవంతుడైన దేవుడు అవతరించాడు. ఇప్పటిదాకా దేశంలో అత్యధిక సంపద ఉన్న దేవుడిగా తిరుపతి వెంకటేశ్వరుడు వెలిగిపోయాడు. ఇప్పుడా రికార్డు బ్రేకయింది! లెక్కలేనంత సంపదతో తిరువనంతపురంలోని అనంత పద్మనాభుడు ఫస్టు ప్లేసుతో లిస్టుకెక్కాడు... భారతదేశ సౌభాగ్యం పల్లెల్లో ఉందని ఒకప్పుడు పెద్దలు అన్నారు. కానీ, అది వాస్తవానికి బాబాల మందిరాల్లోనూ, దేవుళ్ల ఖజానాల్లోనూ ఉందని మరోసారి రుజువైంది.

అనంత పద్మనాభుడి ఆలయంలో అపార సంపద బయటపడుతుంటే- విశాల భారతం విస్తుపోతోంది! నేలమాళిగలు తెరుచుకు వెలుతుంటే- ధనరాశులు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. చరిత్ర పుస్తకాల్లో చదువుకున్న వజ్రవైఢూర్యాలూ, మకరత మాణిక్యాలూ, వజ్ర ఖచిత ఆభరణాలూ, రత్నాయుత రాజపతకాలూ ... ఒకటేమిటి? కళ్లు చెదిరిపోయే స్వర్ణ వైభవంతో ఖజానా కళకళ్లాడుతోంది. దాని విలువపై అంచనాలే కుదరటం లేదు.. లక్ష కోట్లు ఉండొచ్చని కొందరంటే- ఐదు లక్షల కోట్లకు పైమాటేనని మరికొందరంటున్నారు.. అంచనాలు తరువాత- ముందు ఏమేమి ఉన్నాయో పట్టిక సిద్ధం చేయండని సాక్షాత్తూ సుప్రీంకోర్టే పరిశీలక బృందానికి సూచించింది. అత్యంత కీలకమైనదిగా భావిస్తున్న ఆఖరిది, ఆరోదీ అయిన నేల మాళిక ఇంకా తెరవలేదు.. సందట్లో సడేమియాలా పుకార్లు మొదలయ్యాయి. దాన్లో నాగబంధం ఉందని, అది తెరిస్తే అరిష్టమని ప్రచారం ఊపందుకొంది. అలాంటి అల్లాటప్పా గుసగుసలకు గుడ్ బై కొట్టేసి, లెక్కెంతో నిగ్గు తేల్చాలి.

ఇప్పటిదాకా బయటపడ్డ సంపదలో బంగారపు గింజలున్నాయట! స్వర్ణశోభిత అంగీలున్నాయట!! ఇప్పటిలాగానే ఆ కాలంలోనూ ఎంతమంది అన్నవస్త్రాలకు దూరమైతే- ఆ ఆభరణాలు సమకూరాయో!? ఎక్కడిదైనా, ఎప్పటిదైనా సంపద శ్రమ జనితమే... శ్రామికుల ఫలితమే! అందుకనే- ఈ దేవాలయంలోని సంపదంతా ప్రజలదే అని పేర్కొన్నాడు ప్రఖ్యాత చరిత్రకారుడు ఫణిక్కర్. అయినా, ఈ అంతులేని సంపద వల్ల జనానికి ఒక్క పైసా ప్రయోజనం కూడా ఉండదు. ఇంతని అంతని చెప్పకొని సంబరపడ్డానికి తప్ప ఎందుకూ కొరగాదు. పైగా, ప్రజలపై అదనపు భారం పడుతుంది. గుడినీ, గుళ్లో లింగాన్నీ అమాంతంగా మింగేసే స్వాములూ, స్కాములూ స్వైరవిహారం చేస్తున్న రోజులివి. అలాంటి పరిస్థితి నుంచి అనంత పద్మనాభుడినీ, ఆ అనంత సంపదనీ రక్షించటానికి పటిష్టమైన కాపలా ఏర్పాటు చేయాలి. ఇప్పటికే రెండు ప్లాటూన్ల బలగాలను మోహరించారు. ఇంకా శాశ్వత భద్రతకు ప్రత్యేక నిర్మాణాలూ, మరిన్ని బలగాలూ అవసరమవుతాయి.. ఆ భద్రతకు అయ్యే ఖర్చు అక్షరాలా భరించాల్సింది జనమే... అంటే మనమే! నెలనెలా అది లక్షల్లో ఉంటుందని వేరే చెప్పక్కర్లేదు.

చూశారా, ఈ తమాషా...?

స్వామిది సంపద కులాసా... జనానిది కాపలా ప్రయాస...!!

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	4
సినిమా కబుర్లు	...	8
నవ్వుల్ పువ్వుల్	...	11
అట్టమీది కథ	...	14
వికాసం	...	20
కొత్త పుస్తకాలు	...	21
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...



ఈ పేజ్ 6
వినూత్న సేవలతో గూగుల్

పాత బంగారం ... 10
మనసున మల్లెల మాలలూగించిన చిత్రం...



చూద్దామా ... 12
సింగపూర్ సింగారాలు

కథ ... 18
ఓ పాత్ర ఆత్మహత్య



కనులకింపైన చి(ప)త్రాలు

మాజీప్రధాని వాజ్‌పేయ్ కోరిక మేరకు దేశంలో చతుర్భుజ రహదారులకు నాంది పలికారు. కొన్ని ప్రదేశాల్లో అవి రహదారుల్లా కాకుండా అవాంతరాల్లా వున్నాయి. 'పత్ర చిత్రాలు' కనులకింపుగా ఉన్నాయి. బాబా ఆశ్రమాన్ని ప్రభుత్వ పరంచేస్తే, భూ వనరులైన గనులకు పట్టిన గతే వాటికీ పడుతుంది. విదేశీభక్తుల కమిటీ ద్వారా ఆశ్రమాన్ని, అందులోని సొమ్మును కాపాడాలి. భారత సంస్కృతిని కించపరిచిన హుస్సేన్ ఎంత చిత్రకారుడైనా దుర్మార్గుడే. అనువాద ప్రక్రియ సినిమా కొనసాగితే, సినిమా ఖర్చు బాగా తగ్గుతుంది. పుదీన బిర్యాని రుచి బాగుంది. సిడ్నీ అందాలు ఆనందింపజేశాయి. నల్లమల పులులు నేటి రాజకీయ నాయకులకన్నా మేలు. అరువు శరీరాలతో అందాలు చూపిస్తారా అతివలు? మరో ఊరపిచ్చుక ఎర్రమునియా అందం బాగుంది. కార్టూన్లు బాగున్నాయి. పులుల చిత్రాలు హృద్యంగా ఉన్నాయి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

విలువైన 'పాతబంగారం'

26-6-2011 ఆదివారం అనుబంధం పాఠకులతో అందమైన బంధాన్ని ఏర్పరచుకుంది. ఈవారం 'పాతబంగారం' శీర్షికలో ప్రచురించిన 'ఇద్దరుమిత్రులు' స్వర్ణోత్సవం గురించిన తీపిగుర్తులు ఎంతో విలువైనవి. ఆనాటి మధుర జ్ఞాపకాలు మరపురానివి. రచయితకు అభినందనలు. 'హంపి కవితలు' శిలలపై అక్షరాలు నిండినట్లున్నాయి. అవిగవిగో పదాక్షర కవితా సాహిత్యోద్యానవనాలు. తెలుగు వెలుగుల జిలుగు పూలు. ఆనందనందనం కళ్లకు కట్టినట్లుంది. పాలరాతి పుష్పంలో విరిసే విరియని ద్వారాలు మహాద్భుతం. అమోఘం. విలాసాల మకావు అందాలకు నెలవు. ఆనందాల హరివిల్లు అనడంలో ఏమాత్రం సందేహించకూడదని ఈవ్యాసం చిత్రాలు చూసి, చదివాక అనిపిస్తోంది. రంగుల బాలకథ 'సాలె పురుగు తెలివి' బాగుంది. చివరి పేజీపై పత్రచిత్రాలు సొగసులొలుకుతూ అద్భుతంగా ఉన్నాయి.

టి.వి.డి.ఎస్.సీతారామారావు,
విజయవాడ.

ఒక హెచ్చరిక

కవర్ స్టోరీ నెత్తు "రోడ్డు"తోంది. సమాజానికి ఒక హెచ్చరిక. రోడ్లు హైటెక్‌గా, బాగా వెడల్పుగా వున్నప్పటికీ అదే స్థాయిలో ప్రమాదాలూ జరుగుతున్నాయి. దేశంలో ఎక్కువ శాతం ప్రమాదాలు మన రాష్ట్రంలోనే జరుగుతున్నాయనేది సిగ్గుపడాల్సిన విషయం. కొన్ని ప్రాంతాలు ప్రమాద స్థలాలుగా మారిపోయాయి. మనరాష్ట్రంలో 2010లో లక్షకు పైగా చనిపోయారంటే ప్రమాదాల తీవ్రత అర్థమవుతోంది. ఇందులో కొన్ని మానవ తప్పిదాలైతే, కొన్నింటికి గతుకుల రోడ్లు కారణం. వాహన చోదకులు నిబంధనలు పాటించరు. వాహనాన్ని నడుపుతున్నప్పుడు సెల్‌ఫోన్లలో మాట్లాడేవాళ్లని కఠినంగా శిక్షించాలి. ప్రమాదాలపై ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలి.

టి.శ్రీరామమూర్తి, గాజువాక.

హాస్యాన్నందిస్తూనే...

ఈవారం 'అట్టమీదకథ' ఆలోచింపజేసే విధంగా ఉంది. 'పాపమ్మ' కథ బాగుంది. 'వికాసం' శీర్షిక ద్వారా సి.వి. సర్వేశ్వరశర్మ 'టైం మేనేజ్‌మెంట్' వ్యాసం ప్రయోజనకరంగా ఉంది. 'పడమటికొండలు' 'బతుకుసేద్యం'... వంటి కొత్తపుస్తకాల పరిచయ భాగ్యం కలిగింది. 'పత్రచిత్రాలు' ఆనందానుభూతిని ఇచ్చాయి. 'పాతబంగారం' మధురంగా ఉంది. దీన్ని కొనసాగిస్తూ అనేక ఆణిముత్యాల్ని అందించే ప్రయత్నం చేయండి. 'ఈపేజ్' ద్వారా ఆ ముగ్గురు అసమాన మేధావులకు శతకోటి వందనాలను అర్పించాలనిపించింది. 'నవ్వుల్-పువ్వుల్'లో 'చంద్రయానం' జోకు హాస్యాన్నందిస్తూనే, మన పాలకుల నైజాన్ని బయల్పరచటం గమనార్హం. 'సినిమా కబుర్లు' ఆలోచింపజేసే సినీ విశేషాలతో వారం వారం అలరింపజేస్తోంది. పాలరాతి పుష్పం లోటస్ టెంపుల్ వివరాలు బాగున్నాయి. 'చూద్దామా' అంశంలో 'విలాసాల మకావు' చిత్రసహితంగా ఆకట్టుకుంది. 'బాలనేస్తాలు' సదా కాలక్షేపాన్నిస్తోంది. 'మాటలకోట' ద్వారా 'పదసంపద'ను పెంపొందించుకుంటున్నాం.



'మనలోమాట' ప్రశాంత నిలయం..అశాంతి నిలయం అయిపోయింది. ప్చ్.... బాబా...!

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

కథనాలకు చిక్కని ప్రమాదాలు

ప్రజలు ప్రమాదాల్లో దారుణంగా మరణిస్తున్నా పట్టించుకోని పాలకులకు ఇలాంటి కథనాలు కనిపించవేమో. ఇంకా కథనాలకు చిక్కని ప్రమాదాలు ఎన్ని వున్నాయో.... బిడ్డలు తనను యాచకురాలిగా మార్చేసినా వారిమీద తల్లికి ప్రేమ తరగదని 'పాపమ్మ కథ' మరోసారి తెలియజేసింది. 'నవ్వుల్-పువ్వుల్' కడుపుబ్బ నవ్విస్తున్నాయి.

మోతి మోహనరంగా,
సూర్యాపేట.



ఎగ్ వెజిటబుల్ ఫ్రైడ్‌రైస్

కావలసిన పదార్థాలు

కోడిగుడ్లు -2, బియ్యం - అరకిలో
క్యారెట్ ముక్కలు - అరకప్పు
బీన్స్ ముక్కలు - అరకప్పు
పచ్చిబఠాణీలు - అరకప్పు, పచ్చిమిర్చి - 2
సోయాసాస్ - 1 స్పూన్, టమాటాసాస్ -1 స్పూన్
అజినమోటో - చిటికెడు, ఉప్పు - తగినంత
కారం - 1 స్పూన్, మిరియాలపొడి - అర స్పూన్
కొత్తిమీర తురుము - అర కప్పు, నూనె - తగినంత



తయారు చేసే విధానం

ముందుగా అన్నం వండి పక్కన పెట్టుకోవాలి. తర్వాత బాండీలో కొంచెం నూనె వేయాలి. నూనె కాగిన తర్వాత కోడి గుడ్ల సొన వేసి బాగా కలియబెట్టాలి. తర్వాత క్యారెట్, బీన్స్, బఠాణీలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి కొంచెం మగ్గనివ్వాలి. అందులో అన్నం వేసి బాగా కలపాలి. తర్వాత అజినోమోటో, టమాటాసాస్, సోయాసాస్, ఉప్పు, కారం, మిరియాలపొడి వేసి బాగా కలపాలి. చివర్లో సన్నగా తరిగిన కొత్తిమీర చల్లితే వేడి వేడి ఎగ్ వెజిటబుల్ ఫ్రైడ్‌రైస్ రెడీ.

పంచపప్పుల రైస్

కావలసిన పదార్థాలు

బియ్యం - 3 కప్పులు, పెసరపప్పు - అరకప్పు
కందిపప్పు - అరకప్పు, శనగపప్పు - అరకప్పు
ఉప్పు - తగినంత, కరివేపాకు - నాలుగు రెమ్మలు
నెయ్యి - 100 గ్రా, మిరియాలు - 1 స్పూన్
జీలకర్ర - 1 స్పూన్, జీడిపప్పు - 25 గ్రా
కొత్తిమీర - కట్ట, పాలు - 1 గ్లాసు

తయారు చేసే విధానం

కుక్కర్లో నెయ్యివేసి బాగా కాగాక జీడిపప్పు, జీలకర్ర వేయించాలి. కడిగిన బియ్యం, పైన చెప్పిన అన్ని పప్పులూ వేసి 2 నిమిషాలు వేయించాలి. వాటికి రెండింతలు నీళ్ళ, ఉప్పు, పాలు పోసి మూత పెట్టాలి. మూడు విజిల్స్ వచ్చిన తర్వాత దించాలి. చల్లారిన తర్వాత మూత తీసి గరిటతో బాగా కలిపి కొత్తిమీరతో అలంకరించుకోవాలి. అంతే పంచపప్పుల రైస్ రెడీ.

జీరా రైస్

కావలసిన పదార్థాలు

బియ్యం - అరకిలో, జీలకర్ర - 2 టేబుల్‌స్పూన్లు,
ఉల్లిపాయ - ఒకటి (చిన్నది)
కొత్తిమీర - 1 కట్ట, నూనె లేదా నెయ్యి లేదా వెన్న - 3 టేబుల్‌స్పూన్లు, ఉప్పు - సరిపడా

తయారు చేసే విధానం

బియ్యం కడిగి 15 నిమిషాలు నాననివ్వాలి. మందపాటి బాండీలో నూనె వేసి కాగాక జీలకర్ర వేయించాలి. తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. అందులో నానబెట్టిన బియ్యం వేసి ఒక నిమిషం వేయించాలి. లీటరు నీళ్ల పోసి తగినంత ఉప్పు వేసి ఉడకనివ్వాలి. అన్నం సగం ఉడికాక కొత్తిమీర వేయాలి. తర్వాత మంట తగ్గించి మూడు నిమిషాలు ఉడకనివ్వాలి. ఇది వేడివేడిగా తింటే చాలా బాగుంటుంది.



పైనాపిల్ రైస్

కావలసిన పదార్థాలు

బాస్మతి బియ్యం - పావు కిలో
పంచదార - 2 కప్పులు, పైనాపిల్ - ఒకటి
నెయ్యి - పావు కప్పు, జీడీపప్పు, కిస్‌మిస్- పావుకప్పు

తయారు చేసే విధానం

ముందుగా బాస్మతి బియ్యంతో పొడిపొడిగా ఉండేట్లు అన్నం వండుకోవాలి. పైనాపిల్ పండును తొక్క తీసి తురుముకోవాలి. ఈ తురుము, చక్కెర మూకుడులో వేసి ఉడికించుకోవాలి. ఇలా చేస్తున్నప్పుడు ఈ మిశ్రమం నీళ్లలాగా అయి కాసేపటికి చిక్కగా అవుతుంది. అందులో ఉడికించి పెట్టుకున్న అన్నం కలపాలి. చివరలో వేయించిన జీడిపప్పు పలుకులు, కిస్‌మిస్, నెయ్యి వేసి కలపాలి. కాస్త కుంకుమ పువ్వును పాలల్లో కలిపి పైన చల్లితే పైనాపిల్ రైస్ రెడీ.



టమాటా రైస్

కావలసిన పదార్థాలు

బియ్యం - అరకిలో, జీలకర్ర - 1 టేబుల్‌స్పూను
ఆవాలు - 1 టీ స్పూను, ఉల్లిపాయ - 1
టమాటా ముక్కలు - 2 కప్పులు
కరివేపాకు - 4 రెమ్మలు
పచ్చిమిర్చి - 3, గరంమసాలా - అర టీస్పూను
కారం - అర టీస్పూను, కొత్తిమీర - 1 కట్ట
పసుపు - చిటికెడు, నూనె - పావు కప్పు
ఉప్పు - తగినంత



తయారు చేసే విధానం

బియ్యం కడిగి 15 నిమిషాలు నాననివ్వాలి. మందపాటి బాండీ తీసుకుని నూనె/ నెయ్యి/వెన్న వేసి వేడిచెయ్యాలి. అందులో జీలకర్ర, ఆవాలు, పచ్చిమిర్చి, కరివేపాకు, తరిగిన ఉల్లి, టమాటా ముక్కలు వేసి వేయించాలి. అందులోనే బియ్యం వేసి మరో నిమిషం వేయించాలి. తరవాత బియ్యం కొలతకి రెట్టింపు అంటే సుమారు లీటరు పైగా నీళ్ల పోసి తగినంత ఉప్పు వేయాలి. అన్నం మూడొంతులు ఉడికిన తర్వాత కొత్తిమీర వేసి మంట తగ్గించి మూతపెట్టి ఉడికించాలి. మూడు నిమిషాల తరవాత అన్నం ఉడికిందో లేదో చూసి దించాలి.

కవిత్వమ్

నిండు పౌర్ణమిలా విరాజిల్లనీ....!

ప్రియనేస్తం!
నా గుండె గొంతుకల్లో-
కోవెలవై గూడు కట్టుకున్న- గోరింకవు.
శ్రావణ మాసపు పూదోటలో
విరబూసిన అందానివి.
ఉషోదయపు రాగాలవల్లిలా
సందెవేళ కమ్మని సరాగాల్లా
సిరిసిరి మువ్వల సింగారింపు.
పచ్చని మాగాణీల్లో
వెచ్చని విరహాల జల్లువై...
నునుపెక్కిన నీ చెక్కిళ్లపై
జలతారు వన్నె కొంగు
జారుతున్న వన్నె కొంగు
జారుతున్నప్పుడు,
జాలువారె ఆ జలపాత జ్ఞాపకాలై...
ముత్యాల నీ పలువరసల్లో
గల గల పారే గోదారి నవ్వుల్లా...
కళ కళలాడే నీ నగు మోము
నిండు పౌర్ణమిలా విరజిల్లనీ...
ఆసాంతం అమావాస్య-
చీకట్లు కమ్ముకున్నా,
నా కనుపాపలు మాత్రం మూసుకోవు,
ఎందుకో తెలుసా!?
నీవు నా కనుమరుగై
పోతావేమోనని బెంగ...!

- పూజారి నర్సింహులు

సిరిసిల్ల సెమటసుక్క

మనిషిలో నైతిక విలువల పతనం
స్వార్థమే పరమావధిగా సాగుతున్న
పెట్టుబడిదారీ వ్యవస్థ
గోడకు కొట్టిన బంతి
రివ్వున వెనుక్కు వచ్చి
బంతి విసిరిన వాడి
మాడు పగల గొట్టినట్టు
వేతనాల పెంపుదల కోసం
కార్మికులు చేసిన ఉద్యమం
అంతదాకా వున్న
వేతనాన్ని కూడా
తగ్గించి యిస్తున్న
పెట్టుబడిదారీ వర్గపు
కుటిల కుతంత్ర
నియంతృత్వ బాటలో
ఊబిలో కూరుకుపోతున్న
కార్మికుల జీవితాలు
కూతకొచ్చిన
పుంజు కోత
తింటే వుంటుంది.
రంజుగా మోత
కార్మికుల
చమట చుక్కలు కలిపి
శ్రమను నూనెగా చేర్చి
దోపిడీ మసాల దట్టించి
పీకలదాకా మెక్కితే
ఆకసాన వున్న
సుక్కలు దిగివచ్చి
ఆకలి తీరుస్తాయి కాదూ?!
అవి
కార్మికుల సుక్కలు మాత్రం
కావు సుమా!
అయినా
బకాసుర సంతతికి
చెందిన నియంతల్లారా!
మీకు 'సుక్క' లేకుండా
ముద్ద దిగుతుందా
కార్మికుల
చెమట వాసన లేకుండా
నిద్దుర పడుతుందా!?

- మంత్రి లక్ష్మీ నారాయణ

నైవేద్యం!

కట్నం కుమ్మరించి
పిల్లనిచ్చి పెళ్లి చేస్తే
భార్యాభర్త ఇరువురు
హాయిగా.. సుఖంగా
కాపురం చేయాల్సిందిపోయి...
తాళి తెంపుతా....
నిన్ను అడ్డంగా నరుకుతా!!
కట్నం చాల్లేదనో
భార్య నచ్చలేదనే ది
మొగుడు చూపే కుంటి సాకు!
అల్లుడే దేవుడనుకుని
సర్వం నైవేద్యం పెట్టిన
మామకు మిగిలేదేమిటి?
పిల్లతండ్రికి కడకు
మిగిలే గౌరవం ఇదా?
తాళి తెంచుతానన్న వాడు
కొంప ముంచుతాడని అర్థం!
పన్నుపోటు... వెన్ను పోటుకన్న
తాళిపోటు ప్రమాదకరం!
ఈ బెదిరింపులకు...
జరిగే అకృత్యాలకు
అడ్డుకట్ట వేయగలిగే దెన్నడు?
వాటి నిరోధానికి
చర్యలు చేపట్టగల
ధైర్యం తెగింపు
ఆడతనంలో లేదా?
ఈ సమస్యకు పరిష్కారం పూజ్యమేనా?

- యస్ వివేకానంద

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...

సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:

0-97890 99589

హాలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: [ ][ ][ ][ ][ ][ ]

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:**93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:**94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:**98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

గూగుల్... ప్రముఖ సెర్చింజన్‌గా అందరికీ సుపరిచితమే. సాంకేతిక రంగంలో అనేక ప్రయోగాలు చేస్తూ, తన వినియోగదారులకు వినూత్నమైన సేవలను అందిస్తోంది. గూగుల్ సంస్థ ఏం చేసినా అందులో తన ప్రత్యేకతను చాటుకుంటుంది. క్రోమ్ ఓఎస్, ఆండ్రాయిడ్ ఓఎస్ వంటి అద్భుత ఫీచర్లను అందిస్తోన్న గూగుల్ ఈమధ్య మరికొన్ని కొత్తకొత్త ఫీచర్లను తన ఖాతాలో వేసుకుంటోంది. 'గూగుల్ ట్రాన్స్‌లేట్' ద్వారా పలు భాషలకు అనువాదాలు అందిస్తున్న గూగుల్ తాజాగా భారతీయ భాషలలోను తన సేవలు కొనసాగిస్తోంది. మరి ఆ వివరాలేంటో ఈ వారం ఈ పేజీలో తెలుసుకుందాం.

వినూత్న సేవలతో గూగుల్

వాటికి తోడు ప్రస్తుతం మరో అయిదు భారతీయ భాషలను ఆ జాబితాలోకి చేర్చింది. వాటిలో తెలుగు ఒకటి. దాంతోపాటు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఫేస్‌బుక్ హవాను తట్టుకునేందుకు ఫేస్‌బుక్‌కి పోటీగా 'గూగుల్ ప్లస్' అనే సోషల్ నెట్‌వర్కింగ్ సర్వీసుని ప్రారంభించింది. ఇప్పటికే 'ఆర్కుట్'ను నిర్వహిస్తోన్న గూగుల్ మరిన్ని అధునాతన ఫీచర్లతో 'గూగుల్ ప్లస్'ను అందుబాటులోకి తెచ్చింది. వీటితోపాటు 'వాయిస్ సెర్చ్', 'వాట్ డు యు లవ్', 'గూగుల్ నోట్‌బుక్' వంటివి వున్నాయి.

గూగుల్ తెలుగు అనువాదం

ప్రముఖ సెర్చింజిన్ గూగుల్ మరో అయిదు భారతీయ భాషల్లో అనువాద సేవలు అందించడం మొదలుపెట్టింది. గూగుల్ ఇప్పటికే హిందీ, మరాఠీ, మలయాళం, పంజాబీల్లో అనువాద సేవలు అందిస్తుండగా తాజాగా ఈ జాబితాలోకి తెలుగు, కన్నడ, తమిళం, గుజరాతీ, బెంగాలీలు చేరాయి. భారత్, బంగ్లాదేశ్‌లలో ఈ భాషలు మాట్లాడే ప్రజలు దాదాపు 50 కోట్ల మంది ఉన్నారని, తాజా చేరికతో తమ అనువాద సేవలు పలు అంతర్జాతీయ భాషలతో కలిపి 63కు పెరిగిందని గూగుల్ పరిశోధకుడు అశీష్ వేణుగోపాల్ తెలిపారు. ప్రస్తుతం ఈ భాషల అనువాదం అంత సాఫీగా ఉండదని, కొన్ని పదాలు అనువాదం కాకుండా అలాగే వస్తుంటాయని ఆయన తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. భారతీయ భాషలకు ప్రత్యేక లిపి ఉండటం వల్ల వీటికి సంబంధించిన కీబోర్డులు లేనివారు అనుసృజన పద్ధతి (ట్రాన్స్‌లిటరేషన్) ద్వారా పదాలను టైప్ చేసుకోవచ్చునని తెలిపారు.

అయితే ఇంగ్లీష్ నుంచి తెలుగులోకి అనువదించిన పదాలు చాలా వరకు కృతకంగా వుంటున్నాయి. ఉదాహరణకు ఈ దిగువ ఇచ్చిన కొన్ని పదాలను పరిశీలించవచ్చు.

Male- అవివాహితుడు, Female- అవివాహిత, Father in Law- తండ్రిలో చట్టం, Come here- ఇక్కడికి వస్తాయి, Monsoon Session- రుతుపవన సెషన్, Ban Ki Moon- బాన్ కీ చంద్రుడు, Grand Father- గ్రాండ్ తండ్రి, UN World Body Meeting- యుఎన్ ప్రపంచ శరీర సమావేశం, beat them- వాటిని బీట్.

భవిష్యత్‌లో ఈ లోపాలను అధిగమించి సామాన్యులకు సైతం మరింత అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తారని ఆశిద్దాం.

http://translate.google.com/ సైట్ ఓపెన్ చేసి మీరు కూడా ప్రయత్నించండి. ఈ సైట్ ఓపెన్ చేయగానే 'ఫ్రం', 'టు' అనే రెండు ఆప్షన్లు కనిపిస్తాయి. పైన చెప్పినట్లుగా మొత్తం 63 భాషలు ఈ రెండు కేటగిరీలలో కనిపిస్తాయి. 'ఫ్రం' కేటగిరీలో వున్న ఒక భాషను ఎంపిక చేసుకొని, ఆ భాషకు సంబంధించిన టెక్స్ట్‌ను దిగువనున్న బాక్స్‌లో వుంచాలి. తర్వాత 'టు' కేటగిరీలోకి వెళ్ళి ఏ భాషలోకి అనువాదించుకోవాలనుకుంటామో ఆ భాషను ఎంపిక చేసుకోవాలి. అంతే... మనం కోరుకున్న భాషలోకి అనువాదం అవుతుంది. అంతేకాకుండా అనువదించిన పదాలను సెలెక్ట్ చేస్తే ఆ పదం ఏ పదానికి అనువాదమో కూడా చూపుతుంది.

గూగుల్ ప్లస్

సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఫేస్‌బుక్ హవాను చూసిన ఇంటర్నెట్ సెర్చ్ ఇంజన్ గూగుల్ ఫేస్‌బుక్‌కి పోటీ సర్వీసుని ప్రారంభించింది. ప్రస్తుతం ఆర్కుట్ సర్వీస్‌ను గూగుల్ నిర్వహిస్తున్నప్పటికీ, ఫేస్‌బుక్‌కు అది ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోతోంది. అందుకే గూగుల్ ప్లస్ పేరుతో కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ఎవరికీ పోటీ కాదని గూగుల్ చెబుతున్నా.. సైట్‌ను చూస్తే మాత్రం ఫేస్‌బుక్‌కు పోటీనే అంటున్నారు కంప్యూటర్ నిపుణులు. పైగా ఫేస్‌బుక్‌లో లేని సరికొత్త ఫీచర్లనూ ఇందులో పొందుపరిచారు.

గూగుల్ కొత్తగా ప్రవేశపెట్టినటువంటి వెబ్‌సైట్‌లో ఎంతమందితోనైనా వీడియో ఛాట్ చేసుకోవచ్చు. ప్లస్ ప్రాజెక్ట్‌తో సోషల్ నెట్‌వర్కింగ్‌లోనూ అగ్రస్థానాన్ని అందుకోవాలనే ఉద్దేశ్యంతోనే గూగుల్ దీనిని ప్రారంభించిందని అంటున్నారు. ప్రస్తుతానికి అందరికీ దీన్ని ఉపయోగించుకునే అవకాశం లేదు. సైట్ టెస్టింగ్ దశలోనే ఉండడంతో, కొంతమందికి మాత్రమే దీన్ని పరిమితం చేసింది. ముందుగా రిజిస్టర్ చేసుకుంటే, గూగుల్ పరిశీలించి సభ్యత్వాన్ని ఇస్తుందన్నమాట. కావాలంటే మీరు కూడా ఓసారి దాన్ని చూడొచ్చు. సైట్ అడ్రస్ https://plus.google.com/



వాయిస్ సెర్చ్

గూగుల్ క్రోమ్వాడేటటు వంటి కస్టమర్స్ కోసం సెర్చ్ ఇంజన్ గెయింట్ గూగుల్ వాయిస్ సెర్చ్ ఫీచర్‌ని విడుదల చేసింది. ఈ విషయాన్ని గూగులే స్వయంగా శ్యాన్ ఫ్రాన్సికోలో జరిగిన స్పెషల్ ఈవెంట్‌లో డెస్కటాప్‌కు సంబంధించి వాయిస్ సెర్చ్ ఫీచర్‌ని విడుదల చేస్తున్నట్లు తెలిపింది. ఈ కొత్త సెర్చ్ ఫీచర్ వల్ల ఏఏ యూజర్స్ ఇప్పటి వరకు టైపింగ్ చేస్తున్నారో ఇక మీదట అలా లేకుండా మాటల ద్వారా వారి సెర్చ్ రిక్వెస్టులను పంపవచ్చునని తెలిపింది.

వీటితోపాటు గూగుల్ సెర్చ్ బాక్స్‌లో ఓ సరికొత్త మైక్రోఫోన్‌ని ప్రవేశపెట్టింది. యూజర్స్ ఎవరైతే వాయిస్ ఫీచర్‌ని ఉపయోగించాలని అనుకుంటున్నారో వారు ఈ మైక్రోఫోన్‌పై క్లిక్ చేసి వారి వాయిస్‌ని వినిపించాల్సి ఉంటుంది. ఈ ఫీచర్ కేవలం ఒక్క గూగుల్ క్రోమ్ బ్రౌజర్‌లో మాత్రమే వస్తుంది. ఐతే ఈ గూగుల్ సెర్చ్ వాయిస్ ఫీచర్ త్వరలో ఇతర బ్రౌజర్లలో కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం వుంది.

వాట్ డు యు లవ్

వెబ్‌సెర్చ్ ఇంజన్ గెయింట్ రోజురోజుకీ ఓ సరికొత్త టెక్నాలజీ ఫీచర్‌ని ఆవిష్కరిస్తుంది. అందులో భాగంగా మనకు కావాల్సినటువంటి అన్నింటిని ఒకచోటకు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే గూగుల్ కొత్త సర్వీస్ "వాట్ డు యు లవ్"ని త్వరలో ప్రవేశపెట్టనుంది. ఇక గూగుల్ వాట్ డు యు లవ్ ఏమేమి ఆఫర్ చేస్తుందంటే... చూడడానికి ఇది గూగుల్ సెర్చ్ ఇంజన్ మాదిరే ఇందులో ఓ చిన్న బాక్స్ ఉంటుంది. గూగుల్ యూజర్ ఏదైనా బెస్టు అందులో టైపు చేసినప్పుడు దానికి సంబంధించిన సమాచారం గూగుల్ ఇతర ఉపకరణాలు అయినటువంటి గూగుల్ ట్రెండ్స్, గూగుల్ మ్యాప్స్, యూట్యూబ్, ట్రాన్స్‌లేట్ వంటి అన్నింటిని శోధించి మనకు కావాల్సిన సమాధానాన్ని అందిస్తుందన్నమాట.

ఈ విషయాన్ని ప్రముఖ టెక్నాలజీ బ్లాగ్ మాస్చేబల్‌లో గూగుల్ వాట్ డు యు లవ్ సుమారుగా 20 వరకు గూగుల్ సర్వీసెస్‌ని అందిస్తుందని తెలిపింది. గూగుల్ డు యు లవ్ ద్వారా వచ్చినటువంటి ఆన్సర్లలో కుడి వైపు చివరి భాగాన చిన్న గూగుల్ బాక్స్ ఉంటుంది. దీనిని గనుక యూజర్లు క్లిక్ చేసినట్లైతే డైరెక్టుగా సర్వీస్‌లోకి వెళుతుంది. ప్రస్తుతానికి గూగుల్ కొన్ని మార్పులు చేర్పులు చేసి త్వరలోనే విడుదల చేయనున్నారు. గూగుల్ డు యు లవ్ సర్వీస్‌ని చూడాలనుకుంటే ఈ లింక్‌లో http://www.wdyl.com/ చూడవచ్చు.

గూగుల్ నోట్‌బుక్

గూగుల్ నోట్‌బుక్ అనే వెబ్ సర్వీస్‌లో నోట్స్ టైప్ చేసుకోవటానికి ఉపయోగపడుతుంది అంతేకాకుండా బుక్‌మార్క్స్‌ని కూడా క్రియేట్ చేసుకోవచ్చు. నోట్ బుక్ మరియు బుక్‌మార్క్స్‌ని ఎక్స్‌పోర్ట్ మరియు షేర్ కూడా చేసుకోవచ్చు. గూగుల్ అకౌంట్ కలిగిన వాళ్ళు ఇతర గూగుల్ సర్వీసెస్ లానే దీనిని కూడా ఉపయోగించవచ్చు.

గూగుల్ నెక్సస్ ప్రైమ్

మొబైల్ ప్రపంచంలో ఓ సరికొత్త ఆపరేటింగ్ సిస్టమ్‌ని పరిచయం చేసిన ఘనత గూగుల్‌దే. అదే... ఆండ్రాయిడ్. ప్రస్తుతం ప్రపంచం మొత్తం టాబ్లెట్స్, స్మార్ట్‌ఫోన్స్ రంగంలో ఎక్కువ ఉపయోగిస్తున్న ఆపరేటింగ్ సిస్టమ్ ఇది. ఈ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను క్యాష్ చేసుకునేందుకు శ్యామ్‌సంగ్ మొబైల్ కంపెనీతో కలసి శ్యామ్‌సంగ్ నెక్సస్ సిరీస్‌లో భాగంగా స్మార్ట్‌ఫోన్లని విడుదల చేయడానికి గూగుల్ రంగం సిద్ధం చేసింది. శ్యామ్‌సంగ్ మొబైల్ కంపెనీ విడుదల చేసిన నెక్సస్ సిరీస్ బాగా క్లిక్ అయ్యిందనే ప్రచారం విస్తృతంగా జరుగుతున్న నేపథ్యంలో గూగుల్ కోసం ప్రత్యేకంగా శ్యామ్‌సంగ్ నెక్సస్ సిరీస్ ఓ సరికొత్త మోడల్‌ని ప్రపంచానికి పరిచయం చేయనుందని ప్రస్తుతం ఇంటర్నెట్లో జరుగుతున్న ప్రచారాన్ని అనేక టెక్నాలజీ బ్లాగ్స్ సైతం ధృవీకరిస్తున్నాయి. ఈ కొత్త మోడల్ పేరే "గూగుల్ నెక్సస్ ప్రైమ్". ఇది 2012 మధ్యలో విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు నిపుణుల అంచనా.

-కె.ఎక్స్.రాజు

పురుషాధిక్య సినిమా రంగం మహిళలు

దీర్ఘకాలంగా పురుషాధిక్యమయమైన సినీ ప్రపంచంలో ఇప్పటికీ వారికి సమాన సంఖ్యలో స్త్రీలు కనిపించడం లేదేం? ఎంతోమంది నవ యువతులు వివిధ శాఖల్లో సహాయకులుగా పనిచేయడానికి ముందుకు వస్తున్నా, ఆ పైన స్వతంత్రంగా ఆ శాఖల బాధ్యతలను నిర్వహించే స్థాయికి చేరుతున్న వారి సంఖ్య తక్కువే! సినీ రంగం మీద ఆసక్తితో, చిత్ర రూపకల్పన కళను అభ్యసించి, ఆచరించి, పరిశ్రమలో పేరు తెచ్చుకోవాలనే కోరికతో ఎంతో మంది యువతులు వస్తున్నా, చుట్టుపక్కలి పరిస్థితులతో కొద్ది కాలానికే వారిలో ఆ అభిరుచి ఆవిరైపోతోంది. దీనికి కారణం ఏమిటంటే, "ఇవాళ్టికీ సినీ రంగం పట్ల సమాజంలో చిన్న చూపు పోలేదు. దానికి తోడు, కుటుంబం, సినిమా వృత్తి - ఈ రెంటి మధ్య ఏదో ఒక దాన్నే ఎంచుకోవాల్సిన పరిస్థితులు మహిళలకు ఉన్నాయి.

(గతవారం తరువాయి)

దర్శకులు కృష్ణవంశీ, శేఖర్ కమ్ముల, గుణ్ణం గంగరాజు, ఇటీవల కె. రాఘవేంద్రరావుల దగ్గర చెప్పుకోదగిన సంఖ్యలో మహిళా సహాయ దర్శకులు పనిచేస్తున్నారు. "1990లతో పోలిస్తే, ఇవాళ సినిమా సెట్‌లో పలువురు మహిళా సహాయకులు కనిపిస్తున్నారు" అని సినీ ప్రొడక్షన్, పంపిణీ వ్యవహారాల్లో చాలా కాలంగా ఉన్న నెల్లూరుకు చెందిన కళ అన్నారు. "సినీరంగంలో ఇది పెద్ద మార్పు" అని ఆయన వ్యాఖ్యానించారు. గత దశాబ్దిలో వచ్చిన ఈ కొత్త సహాయ దర్శకురాళ్ళ నుంచి 'అలా మొదలైంది..' ఫేమ్ నందినీ రెడ్డి లాంటి కొందరు ఇప్పటికే డైరెక్టర్లయి, తమదైన ముద్ర వేసేందుకు కృషి చేస్తున్నారు. మహిళా దర్శకులంటే జీవితాన్ని విభిన్న దృక్కోణంలో చూపెడతారు. కెమేరాను విలక్షణంగా ఉపయోగిస్తారు. సాధారణ రీతికి భిన్నంగా వెండితెరపై కథలను చూపెడతారనే భావనను చాలామంది వ్యక్తం చేస్తుంటారు.

అయితే, ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం మూర్తీభవించిన భానుమతి లాంటి వారు 'మహిళా దర్శకులు' అనే మాటను సైతం అంగీకరించరు. ఒక భేటీలో ఆమె మాట్లాడుతూ, "నేను మహిళను అని ఎవరు చెప్పారు! నేనెప్పుడూ ఒక మహిళగా అనుకొని, సినిమాలు తీయలేదు. దృశ్యప్రధానంగా తెర మీద చెప్పాలనుకున్న కథలు తీసుకొన్నా, దర్శకత్వం వహించా! అంతే!" అని చాలా రోజుల క్రితమే వ్యాఖ్యానించారు. ఎవరు కాదన్నా, లేదన్నా మహిళా దర్శకులనగానే ఇప్పటికీ వాళ్ళు ఎలాంటి కథలను ఎంచుకోవాలి, ఎలాంటి చిత్రాలు తీయాలి, ఏ బడ్జెట్‌లో తీయాలనే అంశంపై చాలా మందిలో ముందస్తు అభిప్రాయాలు నెలకొంటున్నాయి. "మహిళా దర్శకులనగానే కచ్చితంగా మహిళా సమస్యలనే తెరకెక్కించాలని అనుకొంటే పొరపాటు. జనసామాన్యాన్ని చేరే ఏ కథనైనా తీసుకోవచ్చు. ప్రాథమికంగా మనం ఎలాంటి కథలు చెప్పాలనుకుంటున్నామన్నది ముఖ్యం" అని దర్శకత్వ శాఖలో కె. రాఘవేంద్రరావుతో సహా పలువురు ప్రముఖుల వద్ద దాదాపు తొమ్మిదేళ్ళుగా పనిచేస్తూ వస్తున్న మాజీ జర్నలిస్టు ప్రియదర్శిని అన్నారు. అయితే, "ప్రాథమికంగా సినీ రంగం పురుషాధిక్య ప్రపంచం. కాబట్టి, పరిశ్రమలో మార్కెట్ వాటా సాధించుకోవడం కోసం దర్శకురాలిగా, నిర్మాతగా మరింత శ్రమపడాల్సి ఉంటుంది" అని ఆమె విశ్లేషించారు.

దర్శకురాలు విజయనిర్మల లాంటి వాళ్ళు ఓ పక్కన 'సంఘం చెక్కిన శిల్పాలు' లాంటి ఇతివృత్తాలూ, మరో పక్క మాస్ మెచ్చే 'హేమాహేమీలు', 'మూడు పువ్వులు - ఆరు కాయలు' లాంటి కథలూ తెరకెక్కించారు. "ఎవరి దగ్గరా దర్శకత్వ శాఖలో సహాయకురాలిగా పనిచేయకుండా"నే, ప్రముఖ దర్శకులు సి.ఎస్. రావు, వరప్రసాదరావు, వి. మధుసూదనరావు, బాపు తదితరుల టెక్నిక్‌ను నటిగా సెట్స్‌లో గమనించడం ద్వారా ఆమె స్వశక్తితో దర్శకురాలయ్యారు. హీరో అయిన భర్త కృష్ణ అండదండలతో దర్శక - నిర్మాతగా ఎదిగారు. తనకంటూ ఓ మార్కెట్ సృష్టించుకొని, సొంత చిత్రాలకే కాక, బయటి నిర్మాతల చిత్రాలకూ దర్శకత్వం వహించారు. "నేను దర్శకత్వానికి రావడానికి స్ఫూర్తి - దేశ నాయకురాలు, అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీయే! ఇన్ని కోట్ల మందితో కూడిన దేశం మొత్తాన్నీ ఆమె పరిపాలిస్తున్నప్పుడు, నేనెందుకు సెట్‌లో ఓ వంద మందికి నేతృత్వం వహించలేను? అనిపించేది" అని విజయనిర్మల చెప్పారు. నిజం చెప్పాలంటే, దర్శకురాలు భానుమతి కానీ, తరువాతి తరం విజయ నిర్మల కానీ చాలా పొదుపుగా, ఎంతో వేగంగా సినిమా తీసేవారని ఆ తరం వాళ్ళు ఇప్పటికీ చెప్పుకుంటూ ఉంటారు. అయినప్పటికీ నెలల కొద్దీ షూటింగ్ రోజులతో, భారీ ఖర్చుతో సినిమాలు తీసే దర్శక పురుష పుంగవులకే ఇక్కడ రోజులు చెల్లుబాటవుతున్నాయి.

సినీ రంగమంటే చిన్నచూపే!

మహిళా దర్శకుల పరిస్థితే ఇలా ఉండగా, ఇవాళ తెలుగు చిత్రాల్లో కథానాయిక పాత్రలకు సైతం తెలుగమ్మాయిలకు లభిస్తున్న అవకాశాలు తక్కువే. అందాల ఆరబోతకు అభ్యంతరం చెప్పకపోవడంతో ఉత్తరాది నుంచే ఎక్కువ మంది ఇక్కడకు నాయికలుగా దిగుమతి అవుతున్నారు. "సినిమాల్లో నటించడానికి ముందుకొస్తున్న ప్రతిభావంతులైన తెలుగమ్మాయిలు తక్కువగా ఉంటున్నారు. అందుకే, అవసరానికి తగ్గట్లు వేరే భాషల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది" అని నిర్మాత డి. సురేష్‌బాబు లాంటివాళ్ళు చెప్పారు. అయితే, ఈ మధ్య కాలంలో హీరోయిన్‌గా రాణించిన ఆఖరి తెలుగమ్మాయి లయ మాత్రం "బొంబాయి అమ్మాయిలను హీరోయిన్లుగా తెస్తే తెచ్చారు. కానీ, వాళ్ళను తెచ్చి, అన్ని రకాల డ్రెస్సులూ వేసేదీ వీళ్ళే! నెత్తి మీద పెట్టుకొని భారీ పారితోషికాలు ఇచ్చేదీ వీళ్ళే! తీరా, తరువాతేమో వాళ్ళను తిట్టేదీ వీళ్ళే!" అని అభిప్రాయపడ్డారు. "తెలుగమ్మాయిలకు అవకాశాలివ్వడమే మంచిది. లేదంటే, సినిమా చూస్తుంటే, వేరే భాష సినిమా చూస్తున్నట్లు అనిపిస్తోంది" అని లయ అన్నారు. అయితే, సినిమా రంగంలోని పని పద్ధతుల మీద అనుమానాలు, ఆ రంగం మీద ఉన్న చిన్నచూపు కారణంగా గౌరవప్రదమైన కుటుంబాల నుంచి ఉన్నత విద్యావంతులు ఇటు వైపు చాలా తక్కువగానే వస్తున్నారు.

"సినీ రంగంలో బోల్డుమంది మగవాళ్ళ మధ్యలోనే పనిచేయాల్సి ఉంటుంది. అందరి మధ్య ఒకమ్మాయి పని చేయడం కష్టమే! మన మధ్యతరగతి భారతీయ కట్టుబాట్ల ప్రకారమైతే, ఒక పద్ధతి ప్రకారం వ్యక్తిత్వంతో బతకడం మరీ కష్టం" అని ఓ ప్రొడక్షన్ మేనేజర్ అన్నారు. తళుకుబెళుకుల సినీ రంగంలో లైంగిక దోపిడీ కూడా సర్వసాధారణ అంశమే. పరిశ్రమలోని వారందరికీ బహిరంగ రహస్యమే! "ఇక్కడ అలాంటివేమీ లేవనీ, ఉండవనీ చెప్పడం పచ్చి అబద్ధం, ఆత్మవంచన. అందుకే, సంసారపక్షంగా ఆలోచించేవారు సినీ రంగానికి రావడానికీ, తమ పిల్లల్ని పంపడానికీ విపరీతంగా జంకుతున్నారు." ఈ నేపథ్యంలో ఎన్టీఆర్, ఏయన్నార్, కృష్ణ లాంటి పెద్ద హీరోలు తమ సొంత ఆడపిల్లల్ని సినీ రంగానికి తేవడానికి గతంలో పూర్తి విముఖత చూపడం గమనార్హం!

వివక్ష, ఒత్తిళ్ళకు వనితల ఎదురీత

ఈ నేపథ్యంలో ఈ రంగానికి ఎవరు వస్తున్నారు, వచ్చినవాళ్ళకు అవకాశాలు ఏ మేరకు ఉన్నాయన్నది ప్రశ్న. పైగా, అందుకున్న అవకాశాల్లో సైతం ఆడవాళ్ళకు ఆదరణ ఏ మేరకు లభిస్తోందంటే, సంతృప్తికరమైన సమాధానం రాదు. తెలుగు

చిత్ర రంగంలో తొలి మేకప్ ఉమన్ అయిన శోభాలత 1990లలో చిత్ర పరిశ్రమలో ఎదుర్కొన్న వివక్ష అప్పట్లో సంచలనం రేపింది. ప్రముఖ నిర్మాత కె.ఎస్. రామారావు లాంటి వారు ఆమెకు అండగా నిలిచినప్పటికీ, వృత్తి నిపుణులైన మేకప్ ఆర్టిస్టుల ప్రయోజనాలను కాపాడాల్సిన మేకప్ ఆర్టిస్టుల యూనియన్ పూర్తిగా పురుషాధిక్య భావజాలంతో వ్యవహరించింది. శోభాలతకు గుర్తింపు నివ్వడానికి ముప్పుతిప్పలు పెట్టింది. అవన్నీ అప్పట్లో పత్రికల్లో ప్రముఖ వార్తలయ్యాయి.

వివక్షే కాక పని గంటలు, శారీరక, మానసిక ఒత్తిళ్ళు ఎక్కువగా ఉండడం కూడా ఛాయాగ్రహణం, దర్శకత్వం, కళా నిర్దేశకత్వం లాంటి సాంకేతిక శాఖల్లో మహిళలు తక్కువగా రావడానికి కారణమని సినీ రంగంలోని మహిళలు సైతం అంగీకరిస్తున్నారు. పైఅధికారి నోటి నుంచి మాట వచ్చీ రాక ముందే మనసులో మాట గ్రహించి కెమేరాలు, బరువులు మోస్తూ సెట్‌లో మార్పులు చేయాలన్నా, ఇతర శాఖలతో సమన్వయం సమకూర్చాలన్నా - లింగభేదాన్ని మరిచి ఆడపిల్లలు సైతం మగపిల్లల్లా ముందుకు పోవాల్సిన పరిస్థితి. "మనం స్వతంత్రంగా మనకు అప్పగించిన పనేదో చేసుకుందామంటే ఇక్కడ కుదరదు. అందరితో సమన్వయంతో, సమష్టిగా పని చేయాల్సి ఉంటుంది. ఏమైనా, కెమేరా విభాగంలో పని ఎక్కువ, దర్శకత్వ శాఖలో ఒత్తిడి ఎక్కువ. ప్రతి రోజూ కొత్తే, ప్రతి పనీ పరీక్షే!" అని ఉమర్జీ కుమరన్ పేర్కొన్నారు.

కానీ, మొదటి నుంచి అమ్మాయిలను సున్నితంగా, గారాబంగా, అపురూపంగా పెంచే మన సమాజంలో కఠిన శారీరక శ్రమలకు తగ్గట్లుగా వాళ్ళను తీర్చిదిద్దరు. చిన్నప్పటి నుంచి జరిగిన ఆ పెంపకం, అందుకు విరుద్ధంగా ఉండే సినీ రంగ పరిస్థితుల మధ్య అనివార్యంగా ఘర్షణ నెలకొంటుంది. అవన్నీ తట్టుకొని, ఎవరైనా ఏ దర్శకత్వం లాంటి సినీ శాఖలోనో సహాయకురాళ్ళుగా బరిలోకి దిగినా, వారి మీద సామాజికంగా ఒత్తిడి ఎక్కువ పడుతుంటుంది.

కలగనని పని! కడుపు నింపని జీతం!!

ఈ పరిస్థితుల మధ్య ఈ రంగంలో ఆడపిల్లలు పైకి రావాలంటే, విద్యాధికులైన తల్లితండ్రులు, ప్రోత్సహించే ఉన్నత కుటుంబం, ఆమెలోని ప్రతిభను గుర్తించి అవకాశాలిచ్చేందుకు సాహసించే నిర్మాతలు అవసరం. అవన్నీ సమకూరినప్పటికీ, ఇవాళ 'అలా మొదలైంది...' నందినీ రెడ్డి దర్శకురాలిగా ఆవిష్కృతమై, విజయం సాధించడానికి సుమారు పదేళ్ళ పైగా పట్టింది. కృష్ణవంశీ తదితరుల దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేసిన ఆమె సక్సెస్ అనేక ఏళ్ళ శ్రమ తరువాతే తప్ప, అదాటున వచ్చింది కాదు. "ఆడవాళ్ళకు ఎంత ప్రతిభ ఉన్నప్పటికీ, నమ్మకంతో వారి మీద కోట్లు పెట్టుబడి పెట్టగలిగిన 'అలా మొదలైంది...' నిర్మాత కానూరి దామోదర ప్రసాద్ లాంటివాళ్ళు ఎంత మంది ఉన్నారు చెప్పండి!" అని దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న ఓ యువతి ఆవేశంగా వేసిన ప్రశ్న ఆలోచనలు రేపుతుంది.

తానే మారునా? తీరే మార్చునా?

చిత్రం ఏమిటంటే - సినీ పరిశ్రమలోని మిగతా శాఖలతో పోలిస్తే, శారీరక, మానసిక ఒత్తిళ్ళు కొంత తక్కువగా ఉంటూ, సౌకర్యవంతంగా తోచేవి రచన, ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్ వగైరా. కానీ, వాటిలోనూ ఆశించినంత సంఖ్యలో ఆడవాళ్ళు కనిపించరు. "కొద్దిగా సృజనాత్మకత ఉంటే, ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్ లాంటి శాఖలు మధ్యతరగతి ఆడవారికి కూడా అత్యుత్తమం. ఆరు నుంచి 8 గంటల మేర షిఫ్టుల్లో పనిచేయవచ్చు. ఆదాయం, సృజనాత్మకంగా ఆత్మసంతృప్తి - రెండూ లభిస్తాయి" అని పదేళ్ళుగా దర్శకత్వ శాఖలో పనిచేస్తున్న మరో వనిత అన్నారు. పలువురు దర్శకుల దగ్గర పనిచేసినా తగిన అవకాశాలు రాక, సినిమా మీద అభిమానం చావక సతమతమవుతున్న ఆమె ప్రస్తుతం ఎడిటింగ్ వైపు మార్గం మళ్ళించుకొని, సినీ రంగంలోనే స్థిరపడాలని భావిస్తున్నారు.

మరి, అందరూ చెప్పుకొనే లైంగిక ఆకర్షణలు, అవలక్షణాల మాటేమిటి? రోజూ ఆడా మగా చాలా సన్నిహితంగా పనిచేయాల్సి వచ్చే ఈ గ్లామర్ రంగంలో అసంకల్పితంగానే వారి మధ్య సాన్నిహిత్యం పెరగడం, చాలాసార్లు సరిహద్దులు చెరిగిపోవడం సర్వసాధారణమే! దానికి తోడు 'అవకాశాలు కావాలంటే, అడిగింది ఇవ్వా'లనే లైంగిక వేధింపులు కూడా ఇక్కడ పరిపాటి. "అవకాశాలు సంపాదించి, అనుకున్న లక్ష్యాన్ని అందుకోవడం కోసం దేనికైనా సిద్ధపడే వర్గం ఒకటైతే, పురోభివృద్ధి కోసం వ్యక్తిత్వాన్ని తాకట్టుపెట్టేది లేదని ససేమిరా చెప్పేసే వర్గం మరొకటి. సినీ రంగంలో ఈ రెండు వర్గాలూ ఎప్పుడూ ఉంటాయి. ఆ రెండు వర్గాల వాళ్ళనూ చూశాను" అని తన పత్రికా రచన అనుభవంతో ఏ విషయాన్ని అయినా నిశితంగా గమనించే ప్రియదర్శిని చెప్పారు. అయితే, అవసరమైతే షూటింగులకు బయటి ఊళ్ళకు వెళ్ళి, రోజుల కొద్దీ అక్కడే బస చేయాల్సిన ఈ రంగంలో మన మాట తీరు, మనిషి తీరును బట్టే, అవతలి నుంచి అంతే స్థాయిలో ప్రతిస్పందనలూ ఉంటాయని ఆమె అంటారు. వ్యక్తిత్వానికీ, హుందాతనానికీ భంగం వాటిల్లని రీతిలో గౌరవంగా మనం ప్రవర్తిస్తే, ఎదుటివాళ్ళ నుంచి మనకు కూడా ఆ గౌరవం లభిస్తుందని ఆమె బలంగా నమ్మడమే కాక, విజయవంతంగా ఆచరణలో పెడుతున్నారు.

వర్తమాన సమాజంలో వనిత పురోగతి

సామాజికంగా, రాజకీయంగా వచ్చిన మార్పుల కారణంగా గడచిన పదేళ్ళలో విద్య, ఉద్యోగాల్లో ఆడవాళ్ళు విజృంభించారు. ఎన్నో పోరాటాల తరువాత ఇన్నాళ్ళుగా తాము నిర్లక్ష్యానికి గురవుతున్న సంగతి గ్రహించిన మహిళలు, తమ శక్తియుక్తులతో పురుషుల్ని అధిగమించి, ముందుకు దూసుకుపోవాలని కృషి చేయడం మొదలైంది. ఇవాళ మొబైల్‌ఫోన్, ఇంటర్నెట్, ఫేస్‌బుక్‌ల యుగంలో ప్రపంచం ఎలా ఉందో, ఏ మూల ఏం జరుగుతోందో మహిళలకు బాగా తెలుసు. ఒక పక్క ఇంటి పనులు చక్కబెడుతూనే, మరోపక్క ఉద్యోగ, వృత్తి బాధ్యతలు ఎలా నిర్వహించాలనే క్లిష్టమైన ప్రక్రియలో వాళ్ళు నైపుణ్యం సంపాదించారు. అదే ఇవాళ సినీ రంగానికి కూడా విస్తరిస్తోంది. ఫలితంగా, ఆడా, మగా అనే ఆలోచన కన్నా, వృత్తిలో ఏ మేరకు సమర్థులు, ఎంత చక్కటి ఫలితాలు అందించగలరన్నదే ప్రధానమైన అంశంగా మారుతోంది.

మరి, దీర్ఘకాలంగా పురుషాధిక్యమయమైన సినీ ప్రపంచంలో ఇప్పటికీ వారికి సమాన సంఖ్యలో స్త్రీలు కనిపించడం లేదేం? ఎంతోమంది నవ యువతులు వివిధ శాఖల్లో సహాయకులుగా పనిచేయడానికి ముందుకు వస్తున్నా, ఆ పైన స్వతంత్రంగా ఆ శాఖల బాధ్యతలను నిర్వహించే స్థాయికి చేరుతున్న వారి సంఖ్య తక్కువే! సినీ రంగం మీద ఆసక్తితో, చిత్ర రూపకల్పన కళను అభ్యసించి, ఆచరించి, పరిశ్రమలో పేరు తెచ్చుకోవాలనే కోరికతో ఎంతో మంది యువతులు వస్తున్నా, చుట్టుపక్కలి పరిస్థితులతో కొద్ది కాలానికే వారిలో ఆ అభిరుచి ఆవిరైపోతోంది. దీనికి కారణం ఏమిటంటే, "ఇవాళ్టికీ సినీ రంగం పట్ల సమాజంలో చిన్న చూపు పోలేదు. దానికి తోడు, కుటుంబం, సినిమా వృత్తి - ఈ రెంటి మధ్య ఏదో ఒక దాన్నే ఎంచుకోవాల్సిన పరిస్థితులు మహిళలకు ఉన్నాయి. పైగా, నిర్ణీత పనివేళలు, నికరమైన ఆదాయం ఉండని సినీ రంగంలో ఆడవాళ్ళు పైకి రావాలంటే, ఇంటిలోని వాళ్ళు సినీ రంగంలోని పరిస్థితులను అర్థం చేసుకొని, వారికి రోజు వారీ పనిపాటల్లోనూ, నైతికంగానూ అండగా నిలవాలి. అప్పుడే సినీ రంగ శాఖల్లో మహిళల సంఖ్య పెరుగుతుంది" అని దర్శకత్వ శాఖలో అనుభవజ్ఞులైన సాయి బాలాజీ విశ్లేషించారు. అలాగే, "అవునన్నా, కాదన్నా - ఈ పురుషాధిక్య సమాజంలో ఇవాళ్టికీ మహిళను మగవాడు భోగవస్తువుగానే చూస్తున్నాడు. ఆ ఆలోచనా ధోరణి మారేంతవరకూ సినీ రంగంలో పరిస్థితి మారదు" అని ఆయన ఆవేశంగా అన్నారు. అలాగే, బాహాటంగా ప్రకటించకపోయినా, బహిరంగ రహస్యమైన సామాజిక సమీకరణాలు సైతం దర్శకత్వ అవకాశాలివ్వడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి.

ఏతావతా, ఇవాళ్టికీ సగటు మహిళ భారతీయ ఆలోచనా ధోరణులకూ, సామాజిక సంప్రదాయాలకూ మధ్య సతమతమవుతోంది. సంప్రదాయానికీ, సినిమా వృత్తికీ మధ్య సమతూకం సాధించడమెలా అనే విషయంలో మల్లగుల్లాలు పడుతోంది. ప్రస్తుతం పరిణామ దశలో ఉన్న ఆమె ఆ సమతూకం సాధించగలిగినప్పుడు, సినీ రంగంలోని వివిధ శాఖల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంటుంది. సవ్య భావాలతో కూడిన నవ్య సమాజం ఏర్పడితేనే, మహిళల్లో ఆ పురోగతి సాధ్యపడుతుంది. సమాజంలో శరవేగంతో వస్తున్న మార్పుల రీత్యా ఆ పరిణామం ఎంతో దూరంలో లేదనే అనిపిస్తోంది.

- రెంటాల జూనియర్

మనసున మల్లియ మాలలూగెనే...కన్నుల వెన్నెల డోలలూగెనే...ఎంత హాయి ఈ రేయి నిండెనో... ఎన్ని నాళ్లకీ బ్రతుకు పండెనో..." నాగరాజు ఒళ్లో నిశ్చింతగా తలపెట్టి పడుకొని రేపటి ఆలోచన లేకుండా పాడుతుంది మల్లీశ్వరి. వీనుల విందైన సంగీతం, పాత్రలో లీనమైన భానుమతి అభినయం, ప్రేయసి సాంగత్యంలో సర్వం మరచిన నాగరాజుగా నందమూరి తారకరామారావు నటన... హృద్యమైన చిత్రీకరణ...వీటన్నిటితో ప్రేక్షకులకు కూడా అంత హాయి కలుగుతుంది. తెలుగు వారి మనసులలో మల్లెల మాలలూగించిన చిత్రం వాహినీ వారి 'మల్లీశ్వరి'.

మనసున మల్లెల మాలలూగించిన చిత్రం...

బి.ఎస్. రెడ్డి | సాలూరిరాజేశ్వర రావు | దేవులపల్లి కృష్ణశాస్త్రి

మల్లీశ్వరి సినిమా దృశ్యకావ్యం... దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు రచించిన చిత్రం...ఆయన కలం నుంచి జాలువారిన 'కోతి బావకు పెళ్లంట, పరుగులు తీయాలి గిత్తలు, పిలిచిన బిగువటర, ఆకాశ వీధిలో... ఎందుకే నీకింత తొందర" పాటలన్నీ ఆణిముత్యాలు. స్వరరాజు సాలూరి రాజేశ్వరరావు స్వరాలు ఆ పాత మధురాలు...

గృహలక్ష్మి, వందేమాతరం, సుమంగళి, దేవత, పోతన స్వర్గసీమ, యోగి వేమన వంటి మహత్తర చిత్రాలను అప్పటికే నిర్మించిన బిఎన్‌రెడ్డి వాహిని పతాకంపై నిర్మించిన మరో మేటి చిత్రం మల్లీశ్వరి.

బిఎన్‌రెడ్డి గారు హంపీ విహార యాత్రకు వెళ్లినప్పుడు ఆయనకు శ్రీకృష్ణ దేవరాయల పాత్రతో చిత్రం తీయాలనిపించిందట. ఆకాశవాణిలో వచ్చిన ఓ చిన్న నృత్య నాటిక వారికి బాగా నచ్చిందట. ఆ నాటిక రచయిత బుచ్చిబాబుగారని వినికిడి. ఆ నాటికను దేవులపల్లివారికి వినిపించి సినిమాగా రచించమని కోరేరట. ఆ విధంగా మల్లీశ్వరి సినిమాకు అంకురార్పణ జరిగిందట. దేవులపల్లి వారికి అదే మొదటి చిత్రం కావడం విశేషం.

ఇంకో విశేషం...దేవులపల్లి వారిని కోరిన బిఎన్‌రెడ్డి గారు వారికి కొంత సొమ్ము అడ్వాన్స్ ఇచ్చారట. మూడు నెలల తర్వాత వారు దేవులపల్లి వారి ఇంటికి వెళ్లారట. రచన ఎంత వరకు వచ్చిందని వారు అడగలేదు. వీరు చెప్పలేదు. అది దర్శక నిర్మాత రచయితకిచ్చిన స్వేచ్ఛ. వారి పట్ల గౌరవం. నమ్మకం.

కథ విషయానికి వస్తే అవి శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని పాలిస్తున్న రోజులు. విజయనగరం సమీపాన ఒక గ్రామంలో పద్మశాలి కుటుంబం... ఒక సంపన్న కుటుంబీకుడు. అతని చేతికింద కొన్ని మగ్గాలు వున్నాయి. అతని కూతురు మల్లీశ్వరి. అదే ఊరిలో అతని చెల్లెలు, మేనల్లుడు నాగరాజు వుంటారు. బావ మరణించాడు. వారిది లేమి. మల్లీశ్వరి తల్లి కలవారి ఆడబడుచు. వారి పుట్టింటి వారు రాయల వారి ఆస్థానానికి బట్టలు సరఫరా చేస్తారు. మల్లీశ్వరి తల్లికి నాగరాజు కుటుంబం అంటే చిన్న చూపు. చిన్నప్పటి నుంచి నాగరాజు, మల్లీశ్వరి ఆ ఊరి గుడిలో ఆడుకుంటూ వుంటారు. నాగరాజుకు శిల్పకళపై ఆసక్తి...మల్లీశ్వరి తండ్రికి, నాగరాజు తల్లికి 'మల్లీశ్వరి నాగరాజు'కి పెళ్లి చేయాలని వుంటుంది. ఒక రోజు పొరుగూరు సంతకు వెళ్లి వస్తున్న నాగరాజు, మల్లీశ్వరి వర్షంలో చిక్కుకొని ఒక పాడుబడిన గుడిలో తల దాచుకుంటారు. నాగరాజు మల్లీశ్వరిని పాడమంటే మల్లీశ్వరి పాడుతూ తనకు నచ్చిన రీతిలో నాట్యం చేస్తుంది. ఇంతలో ఇద్దరు బాటసారులు వర్షానికి చిక్కి గుడిలో చేరతారు. కొన్ని జామకాయలు వారికి కానుకగా ఇస్తుంది మల్లీశ్వరి. వీరి నిర్మలత్వానికి అమాయకత్వానికి ముచ్చటపడతారు. ప్రసంగవశాన వారిది విజయనగరం అని చెప్పడంతో మల్లీశ్వరికి రాణివాసం పల్లకి పంపమని కోరతాడు నాగరాజు సరదాగా. ఆ రోజుల్లో రాణి వారికి చెలికత్తెల కోసం రాణివాసం పల్లకి పంపడం ఆనవాయితీ. వాన తగ్గడంతో వారు వెళ్లిపోతారు. వారితో అలా రాణివాసం పంపమని ఎందుకు చెప్పావంటే...'ఆ వారి ముఖానికి రాయలవారి దర్శనం కూడా దొరకదు' అని మాటలను తోసిపుచ్చుతాడు నాగరాజు. ఆ సంగతి ఇద్దరూ అంతటితో మర్చిపోతారు. కానీ బాటసారులిద్దరూ మారువేషంలో దేశ సంచారం చేస్తున్న శ్రీకృష్ణదేవరాయలు, వారి ఆస్థాన కవి, అష్టదిగ్గజాలలో అగ్రగణ్యుడు అల్లసాని పెద్దన... ఏకాంతంలో శ్రీకృష్ణదేవరాయలు మల్లీశ్వరి కానుకనిచ్చి వారు రాణివాసం పల్లకి కోరారని చెబుతాడు. రాణి అంగీకరిస్తుంది. నాగరాజు మల్లీశ్వరి పెళ్లి ప్రస్తావనను మల్లీశ్వరి తల్లి తిరస్కరిస్తుంది. దానితో డబ్బు సంపాదిస్తానని నాగరాజు ఊరు వదిలి వెళతాడు. ఈలోగా రాణి వాసం పల్లకి వచ్చి మల్లీశ్వరిని విజయనగరం తీసుకెళుతుంది. నాగరాజు డబ్బుతో వచ్చి ఈ వార్త విని హతాశుడౌతాడు.ఊరు వదలి వెళ్లిపోయి పిచ్చివాడిలా మల్లీశ్వరి శిల్పాలు చెక్కుతుంటాడు. అక్కడ మల్లీశ్వరికి అంత:పురం చెరలా తోస్తుంది. శ్రీకృష్ణదేవరాయల వారి ఆజ్ఞతో వసంత మంటపం నిర్మిస్తున్న శిల్పాచార్యుడు నాగరాజు చెక్కిన శిల్పాలను చూసి నాగరాజును విజయనగం తీసుకెళ్తాడు. నాగరాజు చెక్కిన శిల్పాలను చూచిన చెలులు అవి మల్లీశ్వరిని పోలి వుండడంతో ఆ వార్తను మల్లీశ్వరికి చెబుతారు. నాగరాజు, మల్లీశ్వరి కలుసుకుంటారు. అంత:పురం దాటి పోవాలనుకుంటారు. కానీ రాజభటులకు దొరికిపోతారు. విచారణలో రాణివాసం పల్లకి వారిని విడదీసిందని చెబుతాడు. కాని వారి కోరిక మేరకే పల్లకి వచ్చిందని శ్రీకృష్ణదేవరాయలు చెబుతాడు. కాదంటాడు నాగరాజు. తనను పరిశీలనగా చూడమంటాడు రాయలు. ఆ నాడు గుడిలో బాటసారులుగా శ్రీకృష్ణదేవరాయలును, పెద్దనను గుర్తిస్తాడు నాగరాజు. శ్రీకృష్ణదేవరాయలు వారిని క్షమించి విడిచిపెడతాడు.

శ్రీకృష్ణ దేవరాయలు శిక్షలు కఠినంగా విధిస్తాడని కానీ వీరి విషయంలో ఉదారంగా ప్రవర్తించారని ... బుచ్చి బాబుగారు అది చదివే నాటికగా మలిచాడని ప్రతీతి.

భానుమతి జీవితంలో అగ్రగణ్యం ఈ చిత్రం. మల్లీశ్వరి విడుదలై అరవై సంవత్సరాలు. వజ్రోత్సవం జరుపుకుంటున్న వెల లేని వజ్రం మల్లీశ్వరి. ఎటు చూసినా హృదయానికి హత్తుకునే చిత్రమిది. ఎలా చూసినా అద్భుత కళాఖండం.

- కోటమర్తి మణి

నవ్వుల్ - పువ్వుల్

ఎందుకు?

(ఓ మహిళ ఒక సమాధి మీద పడి విపరీతంతా ఏడుస్తుంటుంది)

మహిళ: నువ్వు ఎందుకు చనిపోయావ్? అసలు ఎందుకు చనిపోయావ్? నువ్వే వుంటే నాకు ఈ గతి పట్టేది కాదుకదా.

వ్యక్తి: ఎవరిదమ్మా ఆ సమాధి! అంతగా ఏడుస్తున్నావు?!

మహిళ: నా భర్త మొదటి భార్యది సార్.

ఎంత?

పిల్లవాడు: అమ్మా! పెళ్లి చేసుకోడానికి ఎంత ఖర్చవుతుంది?

తల్లి: ఏమోరా కన్నా...నాకూ ఇంతవరకు అంతుబట్టలేదు. ఇప్పటికీ ఖర్చు పెడుతూనే వున్నా.

మొత్తం

పాకిస్తానీ పాప: మా తాత చనిపోతూ చనిపోతూ పదివేల డాలర్లు వదిలి వెళ్లాడు.

అమెరికా పాప: మా తాత చనిపోతూ చనిపోతూ 20 వేల డాలర్లు వదిలివెళ్లాడు.

ఇండియా పాప: మా తాత చనిపోతూ చనిపోతూ మొత్తం ప్రపంచాన్నే వదిలివెళ్లాడు.

చరిత్ర



టీచర్: 1869లో ఏం జరిగింది?

పిల్లవాడు: గాంధీ పుట్టాడు టీచర్.

టీచర్: 1873లో ఏం జరిగింది?

పిల్లవాడు: గాంధీకి నాలుగేళ్లు టీచర్.

పెద్ద

అమ్మాయి: నేను నీకంటే ఏడాది పెద్ద రామూ. కనక నేను నిన్ను పెళ్లి చేసుకోలేను.

అబ్బాయి: పర్వాలేదు. నువ్వు నా వయసుకు వచ్చే వరకు నేను నిన్ను ప్రేమిస్తూనే వుంటాను.

భోజనానికా...

భార్య: ఏం తమాషాగా వుందా! ఇల్లంతా చండాలంగా వుంది. పాత్రలన్నీ మురికిగా వున్నాయి. అయినా మీ మిత్రుణ్ణి భోజనానికి పిలిచారా?

భర్త: అవన్నీ నాకు తెలుసు.

భార్య: అయినా పిలిచారెందుకు మరి?

భర్త: ఆ పిచ్చి సన్నాసి పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడట. అది అర్థం కావాలనే పిల్చాను.

మతిమరుపు

రోగి: డాక్టర్! నాకు ఈ మధ్య మతిమరుపు బాగా పెరిగిపోయింది. రోడ్డు మీద వుండగా పెద్ద అనుమానం వస్తుంది. అసలు నేను ఇంటి నుంచి ఆఫీసుకెళుతున్నానా? ఆఫీసు నుంచి ఇంటికెళ్తున్నానా? అని. ఏదైనా ఉపాయం వుంటే చెప్పండి డాక్టర్.

డాక్టర్: చాలా సింపుల్. సరిగ్గా ఆ సమయంలో నీ క్యారేజీ చూసుకో. అది నిండుగా వుంటే ఆఫీసుకెళుతున్నట్టు. ఖాళీగా వుంటే ఇంటికెళుతున్నట్టు.

గొడవ

తాగుబోతు: (బార్‌లో) బేరర్! ఇక్కడ కాసేపట్లో గొడవ జరగబోతోంది. ముందు నాకు డ్రింక్ తెచ్చివ్వు

(బేరర్ ఇస్తాడు)

తాగుబోతు: బేరర్. ఇక్కడ కాసేపట్లో గొడవ జరగబోతోంది. ముందు నాకు డ్రింక్ తెచ్చివ్వు

బేరర్: సార్. ఇంతకీ గొడవ ఎప్పుడు మొదలవుతుంది?

తాగుబోతు: నువ్వు నన్ను డబ్బులు అడిగినప్పుడు.

విధి

(ఇద్దరు పనివాళ్లు గుంటలు తవ్వుతూ పూడ్చుతూ వున్నారు)

మూడో వ్యక్తి: ఏమయ్యా...ఇందాకటి నుంచి చూస్తున్నాను. మీ ఇద్దరు ఏం చేస్తున్నారు? ఒకరు గుంటలు తవ్వుతున్నారు. ఒకరు గుంటలు పూడుస్తున్నారు? అసలు ఏం నడుస్తుంది ఇక్కడ.

ఒకటవ వ్యక్తి: హ్హా...హ్హా...హ్హా...మేం ముగ్గురం కలిసి మొక్కలు నాటాలి సార్. అయితే మాలో ఒకడు రాలేదు. అలాగని మా పని ఆపుకుంటామా చెప్పండి. నేను గుంటలు తవ్వుతున్నాను. వాడు గుంటలు పూడ్చుతున్నాడు. అంతే.

కె.సాహిల్, హైదరాబాద్.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

చూద్దామా

సింగపూర్ సింగారాలు



వావ్...సింగపూర్! ఇక్కడకు వెళ్లగానే మనల్ని ఆకట్టుకునేది రోడ్లు, రైళ్లు, ఆకాశహర్మ్యాలు. ఇక్కడి వీధులు పరిశుభ్రతకు అసలు సిసలు అర్థాన్నిచ్చేలా వుంటాయి. రహదారులమీద ఎక్కడా చిన్న కాగితం ముక్క కూడా కనిపించదు. ప్రతి చోటా చెత్తకుండీలు అందుబాటులో వుంటాయి. వేగంగా వచ్చి పోతుండే రైళ్లు ప్యాసెంజర్లను గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. ఆకాశాన్నంటే భవనాలు అందంగా ఆకట్టుకుంటాయి. ఇంక వీధి దీపాల సంగతి సరేసరి. ఇది సింగపూర్‌లో దిగీదిగగానే పర్యాటకులకు కనిపించే సర్వసాధారణ దృశ్యం. ఇంక...అక్కడ చూడదగిన ప్రదేశాలు, భవనాలు, ప్రకృతి... సంగతులు అన్నీ ఇన్నీ కావు. ఈ వారం సింగపూర్ సింగారాలను అలా అలా చూసొద్దామా!

మొదటిసారిగా సింగపూర్‌లోకి అడుగెట్టిన పర్యాటకుడిని ఆకట్టుకునేది మూడు. రోడ్లు, రైళ్లు, భవనాలు. బస్సులు, ట్యాక్సీలు, హోటళ్లలో అన్ని చోట్లా ఏసీ సౌకర్యం వుంటుంది. రోడ్లు చాలా శుభ్రంగా వుంటాయి. వయ్యారంగా మెలికలు తిరిగిన ఆ రోడ్ల అందాలను చూచి అలా కదలక మెదలక నిల్చుండిపోయినట్టుండే వీధిదీపాలు ప్రతి చోటా కనిపిస్తాయి. ఇక్కడి ట్రాఫిక్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. చిన్నపిల్లవాడు సైతం సురక్షితంగా రద్దీ ప్రాంతాల్లో కూడా రోడ్డు దాటగలడు. ఎలాగంటే ఎక్కడికక్కడ జీబ్రా క్రాసింగులుంటాయికదా. వాటి ద్వారా ఎంచక్కా దాటొచ్చన్నమాట. పొరపాటున ఏదైనా వాహనం మార్గమధ్యలో ఆగిపోయిందనుకోండి. మనకైతే వెనక వాహనదారులు ఒకటేమని హారన్లు నొక్కేస్తారు. కానీ అక్కడ మాత్రం కాస్త ఓపిగ్గా ఆగుతారంట!

సంతోషాల సాగరం

సింగపూర్' అర్థం ఏంటో తెల్సా! చాలా తమాషాగా వుంటుంది. సింగం అంటే సింహం. పురం అంటే నగరం. ఈ రెంటి కలయికే సింఘపూర్. సింగపూర్ 63 చిన్న చిన్న ద్వీపాల సమూహం. వీటిలో నాలుగు పెద్ద ద్వీపాలుండగా అందులో సెంటోసా ఒకటి. 'సెంటోసా' అంటే 'సంతోషం' అని అర్థం. సంతోషాల సాగరం. దీనివైపు వెళ్లే దారిలో హార్బర్ ఫ్రంట్ వుంది. రోడ్డుమీద నుంచి చూస్తే ఒక అద్భుత దృశ్యం కనిపిస్తుంది. అక్కడ ఓడలు సరకులు దింపుకుంటూనో, ఎత్తుకుంటూనో కనిపిస్తాయి. సెంటోసాకు చేరుకున్నాక అక్కడ స్థానికంగా పర్యటించడానికి వీలుగా బస్సులుంటాయి. వాటిని రెడ్‌లైన్, గ్రీన్‌లైన్ బస్సులని పిలుస్తుంటారు. సెంటోసాలో చూడాల్సినవి చాలానే వున్నాయి. అండర్ వాటర్ వరల్డ్, డాల్ఫిన్ లాగూన్, బటర్‌ఫ్లై అండ్ ఇన్సెక్ట్స్ పార్కు, ఫ్లవర్ క్లాక్...ఇలా ఎన్నో వున్నాయి. అవన్నీ చూడాలంటే ఒక రోజు మొత్తం చాలదు. ఇక్కడ కేబుల్ కార్లు కూడా వున్నాయి. ఒక కొండ మీద నుంచి మరో కొండ మీదికి వీటిద్వారా వెళ్లొచ్చు. కాకపోతే కా...స్త భయంగా వుంటుంది. కానీ ఈ అనుభవం మరువలేనిది. ఇక్కడ నుంచి ఇంకా చూడాల్సినవి వున్నాయి. మ్యూజికల్ ఫౌంటెయిన్, లేజర్ షో. ఇక్కడికొచ్చిన పర్యాటకులెవరూ వీటిని చూడకుండా తిరిగి వెళ్లే ప్రసక్తే వుండదు. సూర్యాస్తమయం తర్వాత చీకటి పడుతున్న సమయంలో ఫౌంటెయిన్లను విద్యుద్దీపాలతో అందంగా అలంకరిస్తారు. ఓ వైపు లౌడ్ స్పీకర్లో సంగీతం... మరో వైపు ఆ సంగీతానికి లయబద్ధంగా నీటి ధారల నృత్యం. అద్భుతం...మసక మసక చీకట్లో సంగీతానికి అనుగుణంగా నాట్యమాడే నీటి ధారలను చూసి పరవశించని వారుండరు. పాదం కదపని వారుండరు.

ఇవే కాదండోయ్! సెంటోసాలో రెస్టారెంట్లు, బీచ్‌లు, రిసార్టులు, గోల్ఫ్‌కోర్సులు... ఒకటా రెండా ఈ వినోదాలన్నింటి కలబోతే. బ్రిటిష్‌వారి కాలంలో దొరసానులు, దొరలు ఇక్కడ చేపలు పట్టేవారట. కొద్ది రోజుల పాటు వారి మిలిటరీ బేస్ ఇదే. అయితే 1972లో దీన్ని వినోద కేంద్రంగా మార్చేశారు. ఆ తర్వాతే పర్యాటకుల రాకపోకలు బాగా పెరిగాయి. ఇహ ఇప్పుడు సెంటోసా గురించి తెలియని పర్యాటకులే లేరు. సింగపూర్‌లో చెప్పుకోదగ్గ బీచ్‌లు ఈ దీవిలోనే వున్నాయి. ప్రేమికులు ఎంతగానో ఇష్టపడే ప్రదేశమిది. సీ స్పోర్ట్స్, వాటర్‌గేమ్స్, సైక్లింగ్, ఇన్‌లైన్ స్కేటింగ్ వంటివి ఇక్కడ ఆస్వాదించవచ్చు. ఇక రాత్రిపూట ఇసుకతిన్నెలపై జరిగే పార్టీల సంగతి చెప్పతరం కాదు.





ఏం భవనాలు!

మెర్‌లయన్ పార్క్! సింగపూర్‌లో చూడదగ్గ ప్రదేశాల్లో ఒకటి. సముద్రం మధ్యలో పేద్ద మెర్‌లయన్ బొమ్మ వుంటుంది. అచ్చం హుస్సేన్‌సాగర్‌లో బుద్ధ విగ్రహం లాగా అన్నమాట. మెర్‌లయన్ అంటే సింహం తల, చేప తోక వున్న ఓ ఆకారం. 37 మీటర్ల పొడవున్న ఈ మెర్‌లయన్ సింగపూర్ టూరిజం బోర్డు వారి చిహ్నం. అక్కడే పనసకాయ ఆకారంలో వున్న ఓ భవనం కూడా వుంటుంది. సూర్య గమనం ఆధారంగా దీన్ని నిర్మించారంటారు. ఆ భవనం లోపలికి వెలుతురు వస్తుంది. కానీ ఎండ మాత్రం పడదట. ఈ భవనాన్ని స్థానికులు దురియన్ అంటారు. దురియన్ అంటే అక్కడ లభించే ఒక పండు.

రాఫిల్ ప్రాంతంలో చేతివేళ్లలా కనిపించే ఐదు ఎత్తైన భవనాలు కనిపిస్తాయి. వాటికి దగ్గర్లో పేద్ద ఫౌంటెయిన్ కూడా వుంది. ఇంతకు ముందు సినిమాల్లో చూసిన ప్రాంతమే ఇది. దానిపక్కనే ఓ షాపింగ్ మాల్ కనిపిస్తుంది. అక్కడ ఎన్నో రకాల పండ్లు వుంటాయి. షాపుల ముందరకెళ్లగానే రుచి చూడ్డానికి పండును ఇస్తారు సిబ్బంది.

ఇక రెస్టారెంట్లలో ఓ తమాషా వుంది. అదేమంటే మనం ఆర్డర్ చేసినదాన్ని మాత్రమే అక్కడ సరఫరా చేస్తారు. అంతేకానీ అది తిన్న తర్వాత తాగడానికి నీళ్లు మాత్రం ఇవ్వరు. కావాలంటే మనం నీళ్ల బాటిల్ కొనుక్కోవాల్సిందే. ఎందుకలా! అంటే...అక్కడివారు ఏదైనా తిన్న తర్వాత నీళ్లు తాగరంట. సూప్‌తోనే సరిపుచ్చుకుంటారు.

ఏం రైళ్లు!

సింగపూర్ రైల్వే గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇక్కడ మనం ఏ స్టేషన్‌కి వెళ్లినా గంటల తరబడి ఎదురుచూడాల్సిన అవసరమే వుండదు. హాయిగా నిముషానికో రైలు వచ్చి వెళుతుంటుంది. వీటిని ఎంఆర్‌టి స్టేషన్లు అంటారు. అంటే మాస్ రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్. ఇవన్నీ భూగర్భంలో దాదాపు ముప్పై అడుగుల లోతులో వుంటాయి. ఏ రైల్వే స్టేషన్‌కి వెళ్లినా సిబ్బంది కనిపించరు. టికెట్ కౌంటర్ దగ్గర మాత్రం ఓ మ్యాప్ వుంటుంది. మనం ఎక్కడికి వెళ్లాలో నిర్ణయించుకుని దానిపై ఉన్న బటన్‌ని నొక్కితే టికెట్ ధర ఎంతో అక్కడే స్క్రీన్ మీద కనిపిస్తుంది. నోట్లు ఓ వైపు, చిల్లర మరోవైపు వేయగానే టికెట్ వచ్చేస్తుంది. ప్లాట్ ఫారం మీదకు వెళ్లాలంటే మరో పని చేయాలి. మన చేతిలోని టికెట్‌ను పంచ్ చేస్తే దారిలో అడ్డంగా వున్న ఐరన్ బార్లు దారి ఇస్తాయి. రైల్లో కూడా ఇప్పుడున్న స్టేషన్ పేరూ రాబోయే స్టేషన్ పేరూ కంప్యూటర్ చెబుతూంటుంది. కొత్తవారైనా సరే ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సింగపూర్ రైళ్లలో హాయిగా ప్రయాణించేలా వుంటుంది.

షాపింగ్ సంగతులు

ముస్తఫా సెంటర్ అనేది పెద్ద షాపింగ్ కాంప్లెక్స్. ఇందులో అన్ని భాగాలనూ తిరిగి చూడాలంటే ఒక రోజు సరిపోదు.

ఆర్చర్డ్ ప్రాంతంలో అనేక షాపింగ్ కాంప్లెక్స్‌లు వున్నాయి. ఇందులో తకషిమాయా ప్లాజా చాలా పేరుగాంచినది.

ఇక్కడ ఎలక్ట్రానిక్ వస్తువులు చాలా చౌక. అందుకే సింగపూర్ వచ్చినవారంతా ఏదో ఒక వస్తువు తప్పక కొనుక్కెళుతుంటారు.



తెల్లారి లేచింది మొదలు...నిద్ర పోయేవరకు అవి లేకుండా గడవదు. టిఫిన్ మొదలుకొని సరకుల వరకు ఏది తెచ్చుకోవాలన్నా అవి కావాల్సిందే. ఇళ్లింట ఆకుకూరలు, పూలు, పండ్లు అమ్ముకొనేవారు కూడా వాటిని ధారాళంగా వాడేస్తుంటారు. ఏం సరకులు తెచ్చుకోవాలన్నా ఖాళీ చేతులు ఊపుకుంటూ వెళితే చాలు. వాటిని మోసుకొచ్చుకోవడానికి వాటిని ఉచితంగానే ఇచ్చేస్తారు. ఇడ్లీ పొట్లాంలో చట్నీని చుట్టడానికి, బిర్యానీ ప్యాక్ చేయడానికి, బజ్జీ పొట్లం కట్టడానికి అన్నిటికీ అవే...అవే... అందాకా ఎందుకు! మున్సిపాలిటీ బండి వెళుతుంటే గాలిలో ఎగురుతూ కనిపించేది అవే. ఆకాశంలో కరెంటు తీగలకు చుట్టుకుని రెపరెపలాడేదీ అవే. పొలాల్లో ముళ్లకంపలకు చుట్టుకుని దీనంగా చూస్తుండేదీ అవే. మురికి కాలువల్లో, చెరువుల్లో తేలుతుండేదీ అవే. తూములకు అడ్డం పడేదీ అవే. ఇంట్లో వ్యర్థపదార్థాలను పడేసేందుకు వాడేదీ వాటినే. తినుబండారాలతో పాటుగా జంతువుల పొట్టల్లోకి వెళ్లి వాటి ప్రాణాలను తీసేదీ అవే. అవేనండీ బాబూ... ప్లాస్టిక్ సంచులు. అవి లేకుంటే క్షణం గడవదు. నిముషం నడవదు. మన జీవితాలతో అంతగా మమేకమైన ప్లాస్టిక్ వల్ల పర్యావరణ సమస్యలు అనేకం. ఈ నెల ఒకటవ తేదీనుంచి మన రాష్ట్ర రాజధానిలో నిషేధం విధించింది ప్రభుత్వం. మరి ప్లాస్టిక్ వల్ల కలిగే ఇబ్బందులు...నష్టాలు... ఏంటో ఈ వారం అట్టమీది కథలో చూద్దాం.

ప్లాస్టిక్ ఒద్దు!

-డా॥ కాకర్లమూడి విజయ్

అది 2001 వ సంవత్సరపు చివరి నెలలు. పశ్చిమ బెంగాల్‌లోని చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ టౌన్షిప్ రైలు సంబంధిత విషయంలో కాక మరో విషయంలో వార్తల్లోకెక్కింది. కొత్త సంవత్సరం నుండి పల్చటి (ఇరవై మైక్రాన్ల కంటే తక్కువ మందం కలవి) ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించారు. అయితే ఆ టౌన్షిప్‌లో ఎటువంటి ప్లాస్టిక్ బ్యాగులనూ ఉపయోగించకూడదని కొంతమంది విజ్ఞప్తి చేశారు. అయితే అక్కడి వారు వచ్చే సంవత్సరం వరకు ఆగకుండా, ఆ మరుసటి రోజునుండే వాటి వాడకం నిలిపివేశారు. మామూలు ప్రజలందరూ దీనిని హర్షిస్తే, ప్లాస్టిక్ వ్యాపారులకు గొడుగు కాసే ఇండియన్ ప్లాస్టిక్ ఫెడరేషన్ మాత్రం టౌన్షిప్ వాసులను తప్పుపట్టింది. ఆ ఫెడరేషన్ చెప్పిన కారణం ఇది: ఇరవై మైక్రాన్ల కన్నా పల్చటి ప్లాస్టిక్ వాడకపోవడం మంచిదే కానీ వీళ్లు అసలు ప్లాస్టిక్ వాడకపోవడం అన్యాయం".

ఆరేళ్ల క్రితం నేలలో కలిసిపోని పాలిథీన్ వాడకంపై ఢిల్లీ ప్రభుత్వం నిషేధం విధించింది. కానీ అది విఫలమయింది. మరో రెండేళ్లలో (2007) తపస్ అనే స్వచ్ఛంద సంస్థ వేసిన పిటిషన్‌పై స్పందిస్తూ పాలిథీన్ బ్యాగుల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను పరిశీలించడానికి ఒక కమిటీ వేసింది. ఆ నివేదిక ప్రకారం కోర్టు లైసెన్స్ లేని పాలిథీన్ రిసైకిల్ పరిశ్రమలను మూసివెయ్యాలని, బ్యాగుల మందం నలభై మైక్రాన్లకు పెంచాలని ఆదేశించింది. చివరికి ఆ మరుసటి ఏడాదికి అన్ని రకాల పాలిథీన్ బ్యాగుల నిషేధానికి మార్గం ఏర్పడింది.

ఇటీవలే మన రాష్ట్ర రాజధానిలో (జంట నగరాల్లో) కూడా అనేక తర్జన భర్జనల అనంతరం నలభై మైక్రాన్ల కంటే పల్చటి ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషేధించారు. విశాఖ, కర్నూలులోని కొన్ని ప్రాంతాలలోనూ ఈ నిషేధం వుంది. దాంతో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులనగానే పెద్ద చర్చనీయాంశం అయిపోయింది ఈ మధ్య. ఇప్పటి వరకూ మనం తయారు చేసి, వాడేసిన క్యారీ బ్యాగులే మరికొన్ని శతాబ్దాల వరకూ వాగుల్లో, వంకల్లో, నదుల్లో, చెరువుల్లో, చెత్త కుప్పల్లో, భూమి పొరల్లో... ఎక్కడబడితే అక్కడ ఎటువంటి ఢోకా లేకుండా 'కలకాలం' నిలిచివుంటాయి. ఇక కొత్తగా వచ్చిన నిషేధం... ఎంత మేలు చేస్తుందో చూడాలి.

అయితే ఎవరో ఒకరు...ఎప్పుడోకప్పుడు... అడుగు వేయాలి కదా ముందుకు! ఎక్కడో ఒక చోట ఒక మంచి ప్రారంభం కావాలికదా!! అలా అక్కడక్కడ అయిన మంచిలన్నీ కలిసి ఒక మహా మంచి జరగాలి. అందుకు ప్రస్తుతపు నిషేధం ఒక మార్గం.

◆◆◆

ప్లాస్టిక్ నిజానికి ఒక సాంకేతిక విప్లవం. మానవ మేధకు దర్పణం. ఆ అద్భుత పదార్థం వల్ల అటు పారిశ్రామిక రంగంలోనే గాక మన నిత్య జీవితంలో కూడా అపూర్వ మార్పులు జరిగాయి. బహుశా ప్లాస్టిక్ లేని వస్తువు దాదాపు లేదేమో అన్నంతగా అల్లుకుపోయింది అది. పిన్నుల నుండి పెన్నుల వరకు, గిన్నెల నుండి గన్నుల వరకు, బకెట్ల నుండి రాకెట్ల వరకు, కవర్ల నుండి కార్ల వరకు, మగ్గుల నుండి ప్లగ్గుల వరకు, చెప్పుల నుండి స్లిప్పుల వరకు... ప్లాస్టిక్ గురించి చెప్పుకుంటూ పోతే చంద్రుడి వరకూ

వెళ్లొచ్చు. అంతా బాగానే ఉంది కానీ చిక్కంతా దిక్కుమాలిన క్యారీబ్యాగుల దగ్గరే వచ్చింది. ఉల్లిపొరలా పల్చగా, గాజులా పారదర్శకంగా, గాలి తెరలా తేలికగా ఉండి, సాంబారు నుండి సంఘం సూపర్ మార్కెట్ వరకు సర్వస్వాన్ని తనలో ఇముడ్చుకునే క్యారీ బ్యాగ్ వామనుడి విశ్వరూపమే. జీవితంలో సెల్లైనా వాడని మహానుభావుడు ఉండవచ్చు కానీ క్యారీబ్యాగు వాడని వాడు ఉండడు గాక ఉండడు. క్యారీబ్యాగులో నుండి ఉల్లిపాయలు జారిపోయినా పట్టించుకోలేదు. ఒకటికి రెండు బ్యాగులు వేసుకున్నాం. ఆల్రెడీ ప్లాస్టిక్ సంచిలోనే వచ్చే పాల ప్యాకెట్, నూనె ప్యాకెట్లను కూడా కూడా క్యారీ బ్యాగుల్లోనే రవాణా చేయించాం. వర్షంలో జేబులోని సెల్లుకీ, తలపైన రెల్లుకీ దాన్నే కవరులా వాడుకున్నాం. వెరసి, ప్లాస్టిక్ మనకి తోడూ నీడై, మనలో భాగమైపోయింది. అదే సమస్య.

పర్యావరణానికి ముప్పు

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వదిలించుకోలేక (సరిగ్గా వదిలించుకునే వ్యవస్థ లేక) వాటి వాడకాన్ని నిషేధించుకున్నాం. ప్లాస్టిక్ తయారయ్యే దశ నుండి, దాన్ని వదిలించుకునే ప్రయత్నం వరకూ అంతా కాలుష్యమయమే. అయినా సరే అది లేని ఆధునిక మానవ జీవితం ఊహించడం కష్టం. ఒక అధ్యయనం ప్రకారం ప్రపంచంలో నిముషానికి పది లక్షల క్యారీ బ్యాగులు వాడబడుతున్నాయి. 'ఇంతకాలం అన్నింటినీ నేనే మోశాను. ఇక ప్రకృతి. తద్వారా నువ్వు నా భారం మొయ్యాలి' అని క్యారీ బ్యాగు అన్నట్టు తయారైంది పరిస్థితి. ఏకై వచ్చి మేకై కూర్చుందంటే ఇదే కాబోలు. ఇప్పుడు మనం దాన్ని వాడలేక, వీడలేక విలవిల్లాడి పోతున్నాం. మనం అనవసరంగా అమాయకపు క్యారీబ్యాగుని ఆడిపోసుకుంటున్నాం గానీ వాస్తవానికి ఎటువంటి ప్లాస్టిక్ అయినా పర్యావరణానికి ఇబ్బందే. నిత్యం వాడి పారేసే పెన్ను రీఫిళ్లు, బట్టల క్లిప్పులు, పైపు ముక్కలు, ప్లగ్గులు, వైర్లు, చిప్స్, వక్కపొడి, గుట్కా వంటి చిరుతిళ్ల కవర్లు... ఇవన్నీ కూడా పర్యావరణాన్ని ముంచడమే తప్ప గొప్ప మంచేమీ చెయ్యవు.

ప్లాస్టిక్ ప్యాకేజింగ్ వల్ల ఆర్థిక, ఆరోగ్య, పర్యావరణ లాభాలు అనేకం ఉన్నాయి. ప్లాస్టిక్ సులువుగా, చవకగా తయారవుతుంది. లోపలి పదార్థాలకు రక్షణ ఇస్తుంది. తాజాదనాన్ని నిలిపి ఉంచుతుంది. కల్తీ కాకుండా తోడ్పడుతుంది. దీర్ఘకాలం మన్నుతుంది. ఈ చివరి లక్షణమే మన ప్రాణానికి ప్రమాదం కలిగిస్తుంది. నేడు దాని ప్రాణం మీదికి తెచ్చింది! అయితే వాడేసిన, ఆ తర్వాత పడేసిన బ్యాగుల వల్లే నష్టాలు కలుగుతున్నాయి. ప్లాస్టిక్ తయారీకి ... అపార శిలాజ నిక్షేపాలను, అధిక మోతాదులో శక్తిని . వాడుతున్నాం. అంతేగాక వీటి తయారీలో అనేక రసాయనాలు కూడా మిళితమౌతాయి. ఈ రసాయనాల దుష్ప్రభావాలు మానవులపై ఏవిధంగా ఉంటాయో ముందుగా పరీక్షించక పోవడం ఒక నష్టమైతే, ప్లాస్టిక్‌లోని పాలిమర్లు ఆహారంలోకి జొరబడి హాని కలిగించడం మరొకటి. ఇక వ్యర్థంగా మిగిలిపోయిన ప్లాస్టిక్ నేలలో అలాగే మిగిలిపోయి భౌమ్య కాలుష్యానికి కారణమైతే, అటువంటి వ్యర్థ ప్లాస్టిక్ బ్యాగులని తగలబెట్టడం మొదలెడితే విపరీతమైన కాలుష్యం ఏర్పడుతుంది.

మందపాటి ప్లాస్టిక్‌ని రీసైకిల్ చేయడానికి వీలవుతుంది. అంటే పాల ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్ల వంటివి వాడేసిన తర్వాత వాటిని కరిగించి మరో రూపంలోకి మార్చవచ్చు. పల్చటి బ్యాగులను అలా రీ సైకిల్ చేయడానికి వీలు తక్కువ. పైగా ఖర్చు ఎక్కువ. అసలు వాటి వాడకం వద్దంటే...

మద్యం అమ్ముతూ తాగొద్దన్నట్లు ఉంటుందంటున్నారు కొంతమంది. లేదా సక్రమమైన, సమర్థవంతమైన రీసైకిల్ పద్ధతులను అభివృద్ధి చేయడం అవసరం. మన ఇంటి వ్యర్థాలను పొడి వాటిగాను, తడివాటిగాను విభజించాలని (పొడివి రీ సైకిల్ కి అనువుగా వుంటాయి. తడివి కంపోస్టుగా మార్చే వీలుంటుంది) ఆ మధ్య అనుకున్నారు. అంత ఓపిక, తీరిక ఇంటి వాళ్లకు లేకపోయింది. చెత్త ఏరుకునే వాళ్లు కొంత శ్రమ పడ్డా, సేకరించే వ్యర్థం కంటే, ఉత్పత్తి అయ్యే వ్యర్థమే అధికంగా ఉండడంతో ఆ ప్రయత్నాలు ఫలితాన్నివ్వడం లేదు. ఇక చెత్త సేకరించే వాహనాలు ఇటువంటి 'విభజన' సెంటిమెంట్లు పట్టించుకోకుండా అంతా ఒకటే అనే సూత్రంతో ముందుకు పోతున్నాయి.

పశువుల ప్రాణాలు తీస్తున్న ప్లాస్టిక్!

అలా విసిరేసిన క్యారీబ్యాగులు తూములని మూసేస్తున్నాయి. పశువుల పేగుల్లో ముడుచుకుంటున్నాయి. చెరువుల్లో తేలుతున్నాయి. నేలలో మగ్గుతున్నాయి. సముద్ర జీవులకైతే ప్లాస్టిక్ ప్రాణాంతకమే. ఏటా కొన్ని వందల సముద్ర క్షీరదాలు, వేలాది పక్షులు ప్లాస్టిక్ బారిన పడి చనిపోతున్నాయి. ఇప్పుడు ఇంకా నయం. అన్నీ రంగుల్లేని బ్యాగులే వస్తున్నాయి. ఒకప్పుడు విచిత్రమైన రంగురంగుల బ్యాగులు వచ్చేవి. అవి మరింత ప్రమాదకరమైనవి. వాటి రంగు పదార్థాల వల్ల ప్రస్తుతం కాస్త మందమైన బ్యాగులను వాడొచ్చు అనేది నిశ్చితం. ప్రపంచంలో ఎక్కడా అసలు ప్లాస్టిక్ బ్యాగులే వాడకుండా నిషేధాలు లేవు. మందమైనవి ఎందుకంటే వాటిని మళ్లీ మళ్లీ వాడుకోవచ్చు. తద్వారా అటువంటి సంచుల ఉత్పత్తి, తద్వారా అటువంటి సంచులు వ్యర్థాలుగా మారడం తక్కువ అవుతుందన్న ఆశ. ఆశ మంచిదే, ఆశయమూ మంచిదే. ఆచరణ? మందమైనవి అందంగా ఉన్నాయని ఒకటికి నాలుగైదు తీసుకుంటారు కొందరు. వాటిని మహా అయితే ఓ అరడజను సార్లు వాడి పడేస్తారు. సమస్య



రీ సైకిల్

ఒకప్పటి సంగతేమో కానీ, నేటి మానవ చర్యలు ప్రకృతిపై భారీ ప్రభావాలు చూపుతున్నాయి. ఈ తరుణంలో మాత్రం మనిషి కొంత బాధ్యతాయుతంగా ప్రవర్తించవలసిన ఆవశ్యకత ఉంది. ఇప్పుడు అంతా యూజ్ అండ్ త్రో (వాడు, పడేయ్) సిద్ధాంతం. అది పెన్నైనా, సెల్‌ఫోనైనా, టీవీ అయినా, కంప్యూటరైనా... పాడైతే అవతల పడేయడమే కానీ బాగు చేయించుకోవడం ఉండదు. (బాగు కోసం చేసే ఖర్చుతో కొత్తదే వస్తుంది). ఆ సిద్ధాంతంతోనే అసలు చాలా వస్తువులు, ఉపకరణాలు తయారు చేస్తున్నారు. ఒకప్పుడు తాత పెట్టుకున్న చేతి గడియారం మనవల వరకు 'ఆస్తి'లా కొనసాగేది. ఇప్పుడు వంద రూపాయలకో వాచీ వస్తుంటే కుర్రాళ్లు తాతల మోత ఎందుకు మోస్తారు? పైగా చవక సరుకు పాడైతే మరో కొత్తది తయారు. ఒకదాన్నే తరాల తరబడి వాడడం పోయింది. దీనివల్ల అనవసరపు, నిరుపయోగపు. పనిచేయని చెత్త పేరుకుపోతుంది. ఇంట్లోనూ. పరిసరాలలోనూ. మరి అది ఎప్పటికైనా, ఎవ్వరికైనా భారమే కదా. ఈ విపత్కర పరిస్థితుల నుండి బయట పడాలంటే మనం కనీసం మూడు చిన్న బాధ్యతలు చేపట్టాలి. అవే రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్.

దేన్నైనా మితంగా వాడడం మొదటిది. పది వాచీలు ఉండడం కంటే ఒకటి సరిపోతుంది కదా (ట్రైం చూసుకోవడం తెలియని వాళ్లూ స్టైల్ కోసం అరచేయంత వాచీలు ముంజేతికి తగిలిస్తున్నారు!). షాపింగ్‌కి వెళ్లినప్పుడు సరుకులకో సంచి కాకుండా వాటి వాడకం తగ్గిస్తే అందరికీ మంచిదే.

సాధ్యమైనంత వరకూ ఒక వస్తువును మళ్లీ మళ్లీ వాడడం రెండవది. రీయూజ్. ఇప్పుడు బాల్‌పెన్నులు ప్రపంచమంతా పరుచుకున్నాయి కానీ ఒకప్పుడు 'ఇంకు పెన్నులు' (ఫౌంటెన్ పెన్నులు) ఉండేవి. రోజుకో రీఫిల్ పడేసి మరోటి వాడే పరిస్థితి బాల్ పెన్నులు కల్పిస్తున్నాయి. అంటే పడేసిన రీఫిలు పర్యావరణంలో గుట్టలుగా పేరుకుంటున్న పరిస్థితి కల్పిస్తున్నాయి. అదే ఇంకుపెన్నైతే పర్యావరణానికి ఇబ్బంది కలిగించకుండా ఎంతకాలమైనా వాడుకోవచ్చు. అలాగే వాటర్ బాటిళ్లు. నీళ్లు తాగి అక్కడే పారేయడం రివాజు. ఇంటికి తీసుకెళ్లడం నామోషీ. ఆ బాటిల్‌ని మరీ ఎక్కువ కాలం కాకపోయినా కొంతకాలం మళ్లీ మళ్లీ వాడుకోవచ్చు.

మూడవది రీ సైకిల్. రీసైకిల్ చేయడం గొప్ప ప్రక్రియ. ప్రత్యేకించి ప్లాస్టిక్ వంటి పదార్థాల రీసైక్లింగ్ ఎంతో అ వసరం కూడా. రీ సైకిల్ ద్వారా మనం వాడి పడేసిన వస్తువులు, పదార్థాలు మరో కొత్త వస్తువుల రూపంలో తయారవుతాయి. అందువల్ల, కొత్తగా మళ్లీ ముడిపదార్థాల కోసం శ్రమపడనవసరం లేదు. ముఖ్యంగా ముడి సరుకు కోసం ప్రకృతి నిల్వలను వాడుకోవాల్సిన పనిలేదు. ఆ విధంగా రీ సైక్లింగ్ ప్రక్రియ వల్ల ప్రకృతి పై భారం తగ్గుతుంది. ఎలాగూ వ్యర్థాలు పర్యావరణంలో ఉండవు కాబట్టి (రీసైకిల్ చేయబడతాయి) ఆ దిశలో కూడా భారం తగ్గుతుంది. ఉత్పత్తి ప్రక్రియల్లో రీసైకిల్ పదార్థాలు వాడడం వల్ల కొత్తగా తయారు చేసే వస్తువులకు అవసరమయ్యే కన్నా చాలా తక్కువ ఇంధనం అవసరం అవుతుంది.

రీ సైకిల్ ప్రక్రియ వల్ల హరిత గృహ వాయువుల మోతాదు తగ్గుతుంది. యుకెలో జరుగుతున్న రీసైక్లింగ్ వల్ల సుమారు పద్దెనిమిది మిలియన్ టన్నుల మేర కార్బన్ డై ఆక్సైడ్ వాయువు విడుదల తగ్గుతుంది. అంటే యాభై లక్షల కార్లను రోడ్లపై నడపకుండా ఆపేస్తే వచ్చే లాభమంత!

రీసైకిల్ చేయడం వల్ల ముఖ్యమైన ముడి పదార్థాలను ఆదా చేసుకోవడమే కాకుండా పర్యావరణాన్ని సంరక్షించుకోవచ్చు.

మళ్లీ మొదటికే. అయితే మందమైన బ్యాగులతో ఒక సౌలభ్యం ఉంది. వాటిని రీసైకిల్ చేయవచ్చు. ఇది కాస్త ఊరడింపు మాత్రమే కానీ పర్యావరణానికి మాత్రం పెద్ద లాభం ఉండకపోవచ్చు.

మరి ప్రత్యామ్నాయం?!

నిషేధం అమలవ్వాలంటే చిత్తశుద్ధి ఎంతో ప్రధానం. ప్లాస్టిక్ నిషేధం విజయవంతం కావాలంటే చిత్తశుద్ధి వుంటే చాలంటున్నారు పర్యావరణవేత్తలు. మరి ప్లాస్టిక్ బ్యాగులకి ప్రత్యామ్నాయంగా కొందరు కాగితపు సంచులు, బట్ట సంచులు, జూట్ బ్యాగులు సూచిస్తున్నారు. అవైతే నేలలో కరిగి కలిసి పోతాయని. కానీ ఈ ప్రత్యామ్నాయాలు అంత చవకైనవి కాదు. మంచి నాణ్యతతో ఉంటే, బట్ట, నార సంచులు చాలాకాలం మన్నుతాయి (ఈ మధ్య అమెరికా వెళ్లే వాళ్లు కూడా చందన బ్రదర్స్ బట్ట సంచుల్లో సర్దుకుని ఫ్లైటెక్కేస్తున్నారు). కాగితం విషయం సంక్లిష్టమైనది. వీటిని ఇంటి దగ్గరే తయారుచేయవచ్చు. పొదుపు సంఘాలు కొన్ని వీటి తయారీపై దృష్టి సారించాయి. బ్రౌన్ కాలర్ పేపర్‌తోనూ తయారు చేయవచ్చు. కానీ దీనికి కొంచెం ఖర్చు ఎక్కువవుతుంది. అయితే కాగితపు సంచుల తయారీకి అరణ్యాలకు అరణ్యాలే నేల మట్టమౌతాయి. ఒకవేళ న్యూస్ పేపర్‌తో కవర్లు చేయాలంటే దానిమీద ప్రింటింగ్ ఇంకులతో ఇబ్బంది. ముఖ్యంగా ఆహార పదార్థాలకి. కాబట్టి సమస్యకి పరిష్కారం నిషేధమొక్కటే కాదు. విచక్షణతో వాడడం మరింత బాధ్యతతో విసర్జనం అవసరం. మనం మన పరిసరాలని అపరిశుభ్రంగా మార్చే అలవాట్లను మార్చుకోవాలి (ఈ విషయంలో మనం ఇంకా అనాగరికులమే). అలాగే ఘన పదార్థ వ్యర్థాలను ఏ విధంగా మేనేజ్ చెయ్యాలో, అందుకు ఎటువంటి సదుపాయాలు అవసరమో ఆలోచించుకోవాలి. (ప్రస్తుతం ఈ విషయంలో మనం బాగా వెనకబడి ఉన్నాం). జూట్ బ్యాగులు తయారుచేసే సంస్థలూ నగరంలో వున్నాయి. ఇవి ఆకర్షణీయమైన రంగుల్లో ఇట్టే కట్టిపడేస్తాయి. వందకు వంద శాతం గ్రీన్ బ్యాగులుగా పర్యావరణ ప్రేమికుల మన్ననలు అందుకుంటున్నాయి. కాకపోతే కూరగాయల సంచీకి 30 రూపాయల వరకు పెట్టాల్సి వుంటుంది. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా తెరపైకి వచ్చిన బయోడీగ్రేడబుల్ ప్లాస్టిక్ బ్యాగులను మన

ప్లాస్టిక్ సంగతులు

- ☞భారత దేశంలో ఏటా రెండు మిలియన్ టన్నుల ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు తయారౌతాయి. మన తలసరి వాడకం సుమారు నూట యాభై బ్యాగులు/ రెండు కిలోలు.
- ☞ప్లాస్టిక్ బ్యాగులు కాగితం కంటే 60 శాతం తక్కువ హరిత గృహ వాయువులను విడుదల చేస్తాయి. ఒక వంద మిలియన్ ప్లాస్టిక్ బ్యాగులు సుమారు మూడువేల టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ వాయువును విడుదల చేస్తే, అంతే మేర కాగితం సుమారు ఏడు వేల టన్నుల వాయువును విడుదల చేస్తుంది.
- ☞కాగితపు సంచుల కంటే ప్లాస్టిక్ బ్యాగుల తయారీలో నలభై శాతం తక్కువ ఇంధనాన్ని వినియోగిస్తాయి. కాగితపు సంచులు ప్లాస్టిక్ సంచుల కంటే డెబ్బై శాతం ఎక్కువ వాయు కాలుష్యాన్ని, యాభై రెట్ల అధిక నీటి కాలుష్యాన్ని కలిగిస్తాయి.
- ☞ప్లాస్టిక్ బ్యాగుల రవాణా కాగితపు సంచుల రవాణా కంటే సులభం, చవక.
- ☞డీగ్రేడ్ కానీ ప్లాస్టిక్ ఏటా పాతిక మిలియన్ టన్నుల చొప్పున పేరుకుంటుంది.
- ☞బ్రిటన్‌లో ఒక అంచనా ప్రకారం ఒక్కో బ్యాగు వినియోగదారుడి చేతిలో సగటున పన్నెండు నిమిషాలు ఉంటుంది. భూమిలో మాత్రం కనీసం వెయ్యేళ్లు ఉంటుంది.
- ☞ప్లాస్టిక్ ఎప్పటికీ సంపూర్ణంగా మట్టిలో కలిసిపోదు. కాల క్రమేణా అది ఫొటో డిగ్రెడేషన్ చర్యకు లోనౌతుంది. అంటే, అందులోని పదార్థాలు నెమ్మదిగా ప్లాస్టిక్ నుండి విడిపోయి జీవజాల మార్గాల ద్వారా అనేక జీవులకు హాని కలిగిస్తాయి.
- ☞ప్లాస్టిక్‌పై ఎటువంటి సూక్ష్మజీవులు ప్రభావం చూపలేవు. అందువల్లే ప్లాస్టిక్ మట్టిలో కలిసిపోదు. ఏటా సుమారు పది లక్షల పక్షులు, లక్ష సముద్ర క్షీరదాలు ప్లాస్టిక్ కారణంగా మరణిస్తున్నాయి. ఉత్తర ప్రదేశ్‌లో ప్లాస్టిక్ తినడం వల్ల అనేక ఆవులు మరణిస్తున్నాయి.
- ☞తాబేళ్లు, నీటిపై తేలే ప్లాస్టిక్ బ్యాగులను జెల్లీ చేపలని భ్రమించి, తిని చనిపోతున్నాయి.

దేశంలో ముంబై, చెన్నై నగరాల్లోని ఉత్పత్తి కేంద్రాల ద్వారా దేశీయంగా బయో డీగ్రేడబుల్ బ్యాలు వ్యాపారం నడుస్తోంది. వీటి ధర బహిరంగ మార్కెట్లో కిలోకి రు.500 నుంచి రు.600 వరకు వుంది. అయితే 45 రోజుల తర్వాత ఈ బ్యాగులు పనికి రాకుండా పోతాయన్న కారణంతో వినియోగంపై వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపడంలేదు. కొందరు ఇంటి పట్టునే బట్టతో సంచులు తయారుచేసుకుని ఉపయోగిస్తున్నారు. పూర్వం ఈ పద్ధతిలోనే సంచులను వాడుకునేవారు. రంగురంగుల బట్టలపై ఎంబ్రాయిడరీ చేసి మరీ బ్యాగులు కుడుతున్నారు. అయితే ఇది అందరికీ సాధ్యం కాదు. పొదుపు సంఘాలు దీనిపై దృష్టి పెడితే మంచి మార్కెట్ వుంటుంది.

మన దేశంలో ముఖ్య నగరాల్లో ఉత్పత్తి అయ్యే చెత్తలో సుమారు అయిదు శాతమే ప్లాస్టిక్. మిగతాది కాగితం. నిర్మాణ వ్యర్థాలు, శానిటరీ నాప్కిన్లు, ఇతర 'తడి' వ్యర్థాలు అని తేలింది. అంటే ప్లాస్టిక్‌పై మన అక్కసుకి అర్థం లేదని తేలింది. అయినా వ్యర్థ ప్లాస్టిక్ ఎప్పటికైనా అనర్థమే. ఆ కోణంలో ఆలోచించి, ఇబ్బంది అనుకున్న ప్లాస్టిక్‌ని ఉత్పత్తి దశలోనే నియంత్రించాలి. మార్కెట్‌ని బ్యాగులతో ముంచెత్తి ఆపై వాడితే కొడతాం, అమ్మితే కుమ్ముతాం అంటే అంత సబబు కాదు. పల్చటి ప్లాస్టిక్ బ్యాగులు పర్యావరణ కాలుష్య కారకాలలో ఒక చిన్న భాగమే. కాబట్టి నిజంగా పర్యావరణం పట్ల ప్రేమ ఉంటే ఇతర కాలుష్య కారకాలపై కూడా దృష్టి సారించాలి. గట్టిగా ఉండాలి.

మనం కూడా ఎవరో నిషేధించారు కాబట్టి మానేద్దాం అనే ధోరణి మాని, స్వచ్ఛందంగా మనమే మన ఏర్పాట్లు చేసుకోవడం ఉత్తమం. ప్లాస్టిక్ మంచిదే. మనం దాన్ని వ్యర్థంగా మార్చే తీరే మంచిది కాదు. అసలు ప్లాస్టిక్‌నే కాదు, మనం పారేసే ప్రతి వ్యర్థాన్నీ జాగ్రత్తగా విసర్జించాలి. చెత్తే కదా అనుకుంటే నెత్తి మీదకు వస్తుంది. అది నలభై మైక్రాన్ల క్యారీ బ్యాగైనా, దిట్టమైన జనపనార సంచైనా.

★

కథ

ఒక పాత్ర ఆత్మహత్య

తెలుగు: డా॥ దేవరాజు మహారాజు
మళయాళం: రాజ్యలక్ష్మి

ఆత్మహత్య–

ఆత్మహత్య పిరికితనానికి గుర్తు.

పిరికితనమూ? కాదు. చూస్తూ చూస్తూ పరుగెత్తే రైలుకింద తల పెట్టాలంటే ఎంత ధైర్యం కావాలి?

ఆత్మహత్య పిరికితనమంటే నేనొప్పుకోను.

"చావడానికి సిద్ధపడడం ధైర్యమే కావొచ్చు. కాని జీవితాన్ని ఎదుర్కోలేక పిరికిగా పలాయనం చిత్తగించడాన్నేమంటారు? వాస్తవ పరిస్థితుల్ని, సమస్యల్ని ఎదుర్కోలేక ఆత్మహత్యకు పాల్పడడం ఖచ్చితంగా పిరికితనమే. సందేహం లేదని నేను ఘంటాపదంగా వాదించేదాన్ని. కానీ .... ఆరోజు నానోటి నుండి మాట రాలేదు.

మా తమ్ముడు, దిన పత్రికలో సంస్మరణ శీర్షిక కింద ఆత్మహత్య చేసుకున్నవారి పేర్లు పెద్దగా చదువుతున్నాడు. అందులో నీరజా చక్రవర్తి పేరు వినిపించింది. ఒక్కసారి భయం, బాధా ఆవహించాయి. ఇదివరకటిలా గలగలా మాట్లాడలేక పోయాను. నీరజా చక్రవర్తి పేరు అందులో నిజంగానే ఉందా. ఆ అమ్మాయి నిజంగానే ఆత్మహత్య చేసుకుందా? నీరజా చక్రవర్తి నాకు సుమారు మూడేళ్ళుగా తెలుసు.

ఓ అదివారం పూట మా ఇంటి కాంపౌండ్ గోడ దగ్గర నడుస్తున్నాను. సెలవు కదా? ఆఫీసుకెళ్ళే పనిలేదు. ఆ సంతోషంలో విశ్రాంతిగా, తీరిగ్గా ఉన్నాను. దక్షిణం వైపు ప్రహరీ గోడ కావల పెద్ద భవంతి ఉంది. అందులోకి ఎవరో నౌకాదళానికి చెందిన అధికారి దిగాడట. అతను ఉత్తర భారత దేశానికి చెందినవాడు. అంతవరకే తెలుసు. ఆ ఇంటి పనిమనిషి అటువైపు నిలబడి ఉంది.

"అమ్మా! మీరు హిందీగాని, ఇంగ్లీషుగానీ మాట్లాడగలరా? అడిగి రమ్మన్నారు" అంది.

హిందీ రాదు. ఇంగ్లీషు తెలుసు అన్నాను. పనిమనిషి ఇంట్లోకి పరుగెత్తింది. చాలాసేపటికి నీరజ బయటికి వచ్చింది. చాలా అందమైన మనిషి. చక్కటి రూపురేఖలు. మొదటిసారి చూడడంతోనే ఎందుకో సదభిప్రాయం కలిగింది. తీరా అమె అడిగిందేమంటే పనిమనిషిని ఉదయం ఎనిమిదింటికి ముందే రమ్మనమని చెప్పాలి. ఆమెకి అర్థమయ్యేట్టు మళయాళంలో చెప్పమని అడగడానికి వచ్చిందన్నమాట! వాళ్ళ పనమ్మాయి ముస్లిం. అర్థమయ్యేట్టు చెప్పాను. ఆమె వెళ్ళిపోయింది. మేమిద్దరం అక్కడే మరి కొంతసేపు నిలబడ్డాం. వాళ్ళాయన ఎనిమిదింటికి వెళ్ళిపోతాడట. పనమ్మాయి తొమ్మిదింటికి వెళ్ళిపోతుంది. ఇక దినమంతా ఇంట్లో ఒక్కతే ఉండాలి. ఒంటరితనంలోని భయం ఆమె తట్టుకోలేక పోతోందని నాకు అర్థమైంది.

ఒక్కతే ఉండలేకపోతే మా ఇంటికి రమ్మని పిలిచాను. ఏదైనా కావాలన్నా అడగమన్నాను. మరుసటి సాయంత్రం ఆమె జంకుతూ జంకుతూ మా ఇంటికొచ్చింది. నేను అంతకుముందే ఆఫీసు నుండి వచ్చి టీ తాగి కూచున్నాను. చిన్న కాగితం ముక్కలో ఆవాలు పొట్లం కట్టుకుని వచ్చింది. వాటిని మళయాళంలో ఏమంటారని అడిగింది. నేను చెప్పాను. ఆ మాట ఆమె హిందీలో రాసుకుంది. కొద్దిసేపు అదీ ఇదీ మాట్లాడి వెళ్ళిపోయింది.

మేం దగ్గరి స్నేహితులం ఎప్పుడు, ఎలా అయ్యామన్నది గుర్తులేదు. కానీ ఆమె దాదాపు ప్రతిరోజూ సాయంత్రం మా ఇంటికి వచ్చేది. ఓ రెండు గంటలు గడిపి వాళ్ళాయన వచ్చే సమయానికి తిరిగి వెళ్లేది. మా చిన్నతమ్ముడు ఆమె అల్లంత దూరంలో కనబడగానే "అక్కా! నీ తెల్ల సీతాకోకచిలుక వస్తోంది" అనేవాడు. నాది తీరికలేని జీవితం. ఎప్పుడూ ఉరుకులూ పరుగులే. బాధ్యతలు బరువులు. నాది అని చెప్పుకునేందుకు టైమే ఉండేది కాదు. నీరజకు ఇదంతా వింతగా ఉండేది. నేను బండెడు ఫైళ్ళు ఇంటికి తెచ్చుకుని రాత్రి పొద్దు పోయేదాకా వాటిలో మునిగిపోవడం ఆమెకు ఆశ్చర్యంగా ఉండేది. కష్టపడి పని చేయడం ఆమెకు తెలీదు. కొద్దిరోజుల్లోనే ఆమె కొన్ని మళయాళ పదాలు నేర్చుకుంది. నన్ను 'చెచి పెద్దక్కా' అని పిలిచేది. ఇంటి పనంటే నాకు విసుగ్గా ఉండేది. కానీ ఏం చేస్తాను? తప్పదు. చేసుకునేదాన్ని. ఓసారి నేను చెమటలు కారుస్తూ బట్టలు ఇస్త్రీ చేసుకోవడం చూసింది. అప్పటి నుండి నేను ఆఫీసుకు వెళ్ళిపోగానే నా చీరలన్నీ వెతికి చక్కటి మడతలతో ఇస్త్రీచేసి పెట్టేది. ఒక్కోసారి అన్నీ తన ఇంటికి తీసుకెళ్లి ఇస్త్రీ చేసుకొచ్చేది.

మా అమ్మ నన్ను చివాట్లు పెట్టేది. "ఆమె ఎవరనుకున్నావే. పెద్ద ఆఫీసరు భార్య! ఆమెతో నీ పనులు చేయించుకోవడం ఏం బావుంటుంది?" అనేది అమ్మ. ఆమాటే నేనామెతో అని... వారిస్తే ఆమె నావైపు చాలా దీనంగా చూసింది. పని చేయడంలోనే ఆమె సంతోషం వెతుక్కుంటోందన్న విషయం నాకు అర్థమైంది.

సంపదతోనూ, హోదాతోనూ, మధ్యవయస్కుడైన భర్తతోనూ ఆమె సుఖంగా లేనట్టుంది. కాని ఏనాడూ తన భర్త ప్రవర్తన గురించి చెప్పలేదు. కానీ, కొన్ని విషయాలు చెప్పకుండానే అర్థమౌతాయి. ఆమె నడకలో, మాటల్లో ఏదో విషాదం తొణికిసలాడుతుండేది. బరితే కొండల్లోని మంచు మాటున ఏముందో.... ఆమె బతుకు అగాధాల్లో ఏముందో.... తెలుసుకోవడం చాలా కష్టం అనిపించేది.

ఆఫీసు పనితో విసిగిపోయి ఓసారి సెలవుపెట్టి ఊరికి వెళ్ళిపోయాను. చాలా రోజులు విశ్రాంతి తీసుకున్నాను. సెలవైపోయి తిరిగొచ్చిన రోజు తెలిసింది. నీరజ తల్లి కాబోతోందని!

ఆమె కాన్పు కోసం తల్లిగారింటికి వెళ్ళినప్పుడు ఆయనగారు వెంట వెళ్ళలేదు. ఎవరో నమ్మకస్తుడైన సేవకుణ్ణి పంపించారు.

ఓరోజు వాళ్ళ పనమ్మాయి విడిచిన బట్టలపెట్టిలోంచి ఓ మందు సీసా తీసుకొచ్చింది. చూస్తే అది విటమిన్ టాబ్లెట్ల సీసా.

"మా అమ్మగారు ఎప్పుడూ సరిగా మందులు వేసుకోరండి. అన్నీ కిటికీలోంచి పారబోస్తుంటారు నేనెన్నో సార్లు చూశాను" అంది.

"బలానికి డాక్టరు వేసుకోమని ఉంటాడు. వేసుకుందామన్న ఉద్దేశంతోనే దాచిపెట్టుకుని ఉంటుంది"

నేను చాలా సంతోషించాను. ఎందుకంటే ఆమె ఒంటరి తనానికి బిడ్డ ఓ వరం!

నీరజ ఎత్తయిన పొట్టతో ఆయాసపడుతూ వచ్చి ఎప్పటిలాగానే నా పనులు చేస్తుండేది. నా వెంట్రుకలు చిక్కు తీస్తుండేది. అలా రోజులు దొర్లిపోయ్యాయి.

ఆమె కాన్పు కోసం తల్లిగారింటికి వెళ్ళినప్పుడు ఆయనగారు వెంట వెళ్ళలేదు. ఎవరో నమ్మకస్తుడైన సేవకుణ్ణి పంపించారు.

ఓరోజు వాళ్ళ పనమ్మాయి విడిచిన బట్టలపెట్టిలోంచి ఓ మందు సీసా తీసుకొచ్చింది. చూస్తే అది విటమిన్ టాబ్లెట్ల సీసా.

"మా అమ్మగారు ఎప్పుడూ సరిగా మందులు వేసుకోరండి. అన్నీ కిటికీలోంచి పారబోస్తుంటారు నేనెన్నో సార్లు చూశాను" అంది.

"బలానికి డాక్టరు వేసుకోమని ఉంటాడు. వేసుకుందామన్న ఉద్దేశంతోనే దాచిపెట్టుకుని ఉంటుంది" అని సర్దిచెప్పాను. కానీ నాకీ విషయం సరిగా బోధపడలేదు. మందుల సీసా విడిచిన బట్టలపెట్టెలో దాచడం ఎందుకు?

నాలుగు రోజుల తర్వాత మా చిన్న తమ్ముడు వార్త మోసుకొచ్చాడు. వీధి మలుపులో నీరజ భర్త కనిపించాడట. నీరజ ప్రసవించిందట. కానీ బిడ్డ చనిపోయి ఉందట.

మరో మూడు నెలల తర్వాత నీరజ తిరిగి వచ్చింది. ఆ సాయంత్రం నేను ఇల్లు చేరగానే వచ్చింది. మునుపటికన్నా బాగా చిక్కింది. పదేళ్ళు వయసు మీద పడ్డట్టుంది ముఖం. మొట్టమొదటిసారి మనసు విప్పి భోరున ఏడ్చింది.

"మా ఇద్దరిలో ఎవరో ఒకరు మాత్రమే చనిపోతారని అనుకోలేదక్కా.. పోతే ఇద్దరం పోతామనుకున్నాను" అంది ఏడుపు మధ్యలో. ఆమెను ఎలా ఓదార్చాలో తెలీలేదు

అదీగాక, క్రమక్రమంగా ఆమెకు కొంచెం ధైర్యం చెప్పి మళ్ళీ మామూలు మనిషిని చేయడానికి వీలే లేకపోయింది.

వాళ్ళు మా పక్కిల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. నౌకాదళంలో ఉన్నఫళంగా బదిలీలు జరిగాయట. ఈయనకి కూడా ట్రాన్స్‌ఫర్ వచ్చిందట.

వెళ్ళిపోయేముందు నేనే ఆమె దగ్గరికి వెళ్ళాను. సామాన్లు సర్ది పెడదామని సెలవు పెట్టాను కూడా. కానీ ఆమె నన్ను ఏ పనీ చేయనివ్వలేదు. అన్నిపనులకు అంత మంది మనుషులున్నారు.

"వాళ్ళు చేస్తార్లే అక్కా! నువ్వు కాసేపు నా దగ్గర కూర్చో చాలు" అంది నీరజ. అలాగే కూర్చున్నాను. ఇంటి దగ్గరే వాళ్ళకు వీడ్కోలు చెప్పాను. నీరజ చేతులు జోడించి మా అమ్మ దగ్గర సెలవు తీసుకుంది. నా ముఖంలోకి చూడకుండానే "వెళ్ళొస్తానక్కా" అంది. ఆమె ముఖంలో దు:ఖం లేదు. ఏదో తెలియని నిర్లిప్తత!

"మళ్ళీ వస్తావా నీరజా!" అని అడిగాను ఆశగా.

"కాదు. సెలవు అని చెప్తున్నానంతే" అంది.

నాకెందుకో బాధేసింది. ఆమెను మళ్ళీ చూడను కదా అని అనిపించింది. ఇదే చివరి చూపా అని మనసు కొట్టుకులాడింది. తర్వాత ఆమె అప్పుడో ఉత్తరం... ఇప్పుడో ఉత్తరం రాస్తుండేది. అందులో పెద్దగా విషయాలేవీ ఉండేవి కావు. కేవలం నా జాబు రాబట్టుకోవడానికి అదో పద్ధతి అనిపించింది.

ఇప్పుడేమైందీ?

"ఆత్మహత్య చేసుకునే వాళ్ళు పిరికివాళ్ళు, మూర్ఖులు" అని అన్నారంతా. కాని నా నీరజా! నీ గురించి అంతా తెలిసి నేనేమనగలను? నీకు భయమంటే భయం లేదు. నీకు ప్రేమించడం తెలుసుననీ నాకు తెలుసు. కానీ, కానీ...... ఎందుకిలా అయిపోయ్యావు నీరజా?

★

రచయిత్రి గురించి

'ఒక పాత్ర ఆత్మహత్య' అనే కథను మళయాళ రచయిత్రి రాజ్యలక్ష్మి అలా ముగించారు. కథలో ఆత్మహత్య చేసుకున్న 'నీరజా చక్రవర్తి' అనే పాత్ర గురించి 'నేను' అనే పాత్ర ఎంతో బాధపడుతుంది. కానీ ఒక సంవత్సరం గడిచేసరికి పాత్రల జీవితాలు తారుమారయ్యాయి. రచయిత్రి సృష్టించిన పాత్రగా నీరజా చక్రవర్తి మళయాళ సాహిత్యంలో బతికింది. 'నేను' అనే పాత్ర (రచయిత్రి రాజ్యలక్ష్మి) చివరి శ్వాస విడిచింది. 1965లో రచయిత్రి రాజ్యలక్ష్మి ఆత్మహత్య చేసుకున్నారు. లేకపోతే మరిన్ని రచనలు సాహితీ ప్రియులకు దక్కేవి. జీవితంలోని అసంతృప్తి, వైరుధ్యాలు ఆమెను బతకనీయలేదు.

వికాసం



"5 నుండి 10 సంవత్సరాల వయసుగల పిల్లల్లో సృజనాత్మక ధోరణి 95 శాతం మందిలో ఉంటుంది.20 సంవత్సరాలు దాటిన వారిలో 5 శాతం మందికే సృజనాత్మకత ఉంటుంది" నోటి మాటగా కాదండీ. ఆధునిక పరిశోధనలు చెప్తున్న మాటలు ఇవి. ఈ రెండు వాక్యాల గురించి కాస్త ప్రశాంతంగా ఆలోచిస్తే...ఒక అనుమానం తప్పక వస్తుంది. అదేమంటే... పదేళ్ల లోపు అంత సృజనాత్మకంగా వున్న పిల్లలకు ఆ తర్వాత ఏమౌతోంది? వారిలో సృజనాత్మకత ఎందుకు తగ్గుతుంది? 10 నుండి 20 సంవత్సరాల వయసులో మానసికంగా మార్పులు రావడానికి కారణాలు ఏమిటి? అన్న అనుమానం వస్తుంది. అవేంటో తెలుసుకుందామా!

సృజనాత్మకంగా...

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

ఈ వయసు పిల్లలకు ఇంట బయట ఎదురయ్యే హెచ్చరికలు వారి సృజనాత్మక శక్తిని దెబ్బతీస్తాయి. వారేదైనా అడిగినా, ప్రశ్నించినా, మాట్లాడినా 'తెలివి తక్కువ ప్రశ్నలు అడగకు, పగటి కలలు వద్దు, ఆటలాడే వయసు దాటిపోయింది, మిడిమిడి జ్ఞానంతో మాట్లాడకు, అర్థవంతంగా మాట్లాడ లేకపోతే నోరుమూసుకో' అంటుంటాం. కానీ ఒక విషయం మరువకూడదు. 10 నుండి 18 సంవత్సరాల వయసులోవున్న పిల్లలకు విద్య సమాచారం అందించడానికి, జ్ఞాపకశక్తి, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి నిర్దేశించబడింది. ఊహ అనేది ప్రాయోగిక నైపుణ్యాలకు ఆయువుపట్టుగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో అనేకానేక పరిస్థితులు వ్యక్తిలో వున్న సృజనాత్మక దృష్టికి గంతలు సమకూరుస్తున్నాయి.

సృజనాత్మకతకు అడ్డంకులు

♦ ప్రతికూల దృక్పథం ♦ విజయం సాధించలేమనే భయం ♦ అనుకోవడాలు ♦ ఊహించుకోవడాలు - నలుగురిలో తెలివి తక్కువగా కన్పిస్తారేమోననే భయం ♦ తనకు సృజనాత్మకత లేదని బలమైన నమ్మకం ♦ మనసులో మాట ఎవరికి చెప్పకపోవడం ♦ జవాబు కోసం అన్వేషించక ఎదురు చూడడం ♦ ఏదైనా విషయం అర్థంకాక పోతే నిశ్శబ్దంగా ఉండిపోవడం ♦ తనకు వచ్చే ఆలోచనలు నమోదు చేసుకోక పోవడం ♦ సమస్య పరిష్కారం ఒక తీవ్రమైన అంశంగా పరిగణించడం ♦ సాధ్యమైనంత వరకు తప్పులు చేయకపోవడం

అలవరచుకోవలసినవి!

♦ ప్రతి విషయాన్ని సవాలుగా తీసుకోవాలి ♦ రిస్కు తీసుకునేందుకు ఇష్టపడాలి ♦ ఆసక్తితో ముందుకు సాగాలి, కొత్త సాంప్రదాయాలకు శ్రీకారం చుట్టాలి ♦ సమస్యలను ముందుగా ఊహించడం అలవరచుకోవాలి ♦ సృజనాత్మకతలో తప్పులు చేయడం ఒక సహజ ప్రక్రియ అని గుర్తుంచుకోవాలి ♦ అడ్డంకులు ఎదురైనపుడు చిన్న బ్రేక్ తీసుకుని అధిగమించాలి ♦ స్వతంత్రంగా వ్యవహరించడం నేర్చుకోవాలి ♦ ఎవరి సహాయంకోసం ఎదురుచూడకూడదు ♦ ఆలోచనలు వచ్చినపుడు వాటిని నమోదు చేసుకోవాలి ♦ ప్రతి విషయాన్ని పార్శ్వదిశలో కూడా ఆలోచించడం అలవరచుకోవాలి ♦ ఎప్పుడూ న్యాయం చెప్పే నిర్ణయాలు తీసుకోకూడదు ♦ సృజనాత్మకతగల యువత ఎందరో తమ శక్తిని తామే అణగదొక్కేసుకుంటున్నారు. వారికి కొంత ఉపయుక్తంగా ఉంటుందని పై మార్గ దర్శక విధానాలు చెప్పడం జరిగింది.

మీలో కూడా సృజనాత్మక శక్తి ఉంది!

సృజనాత్మకత కొందరి సొంతం అని చాలామంది అభిప్రాయం. రచయితలు తమ సృజనాత్మకతను రచనలో ప్రతిబింబించగలరని, చిత్రకారుడు. అసాధారణ ప్రతిభతో చిత్రాలు గీసి తన సృజనాత్మకతను చాటుకోగలడని అభిప్రాయపడుతుంటారు. అదే విధంగా ఇంజనీర్లు, వాస్తు శిల్పులు, ప్రణాళికానిర్మాతలు వీరంతా సృజనాత్మకశక్తి గలవారని భావిస్తాం. ఎందుకంటే వీరు కొత్తగా అందాలు వొలికే విధంగా తమ వృత్తిలో కొత్తవి సృష్టించగలుగుతారు. తమాషా ఏమిటంటే సామాన్యుడిలో కూడా సృజనాత్మకత ఉంటుందని ఎవరూ చెప్పుకోరు. నిజానికి సామాన్యులలో కూడా సృజనాత్మకత గలవారు ఎందరో ఉంటారు. వారిని విస్మరిస్తే ఎలా? చిన్న ఉదాహరణ చెప్పుకుందాం. తక్కువ ఆదాయవర్గ ప్రజలను తీసుకుందాం. వీరిలో కొందరి ఇళ్లు ఎంతో ఆకర్షణీయంగా అలంకరించి ఉంటాయి. అలంకరణకు చౌకగా ఉండే వస్తువులను మాత్రమే వాడతారు. కాని వాటిని అమర్చిన రీతి ఎంతో అద్భుతంగా ఉండి ఇల్లు ఎంతో చూడముచ్చటగా ఉంటుంది. ఇది వారిలోని సృజనాత్మకతకు నిదర్శనం కాదా? రికార్డులు భద్రపరచడం, పిల్లల్ని నిర్మాణాత్మకంగా ఏదో ఒక పనిలో నిమగ్నమయ్యేటట్లు చేయడం, తమ వద్ద పనిచేసే ఉద్యోగులు మనసు పెట్టి తగవులేని వాతావరణం సృష్టించగల్గడం, వ్యాపారంలో కష్టమర్లతో స్నేహపూరిత సంబంధాలు కొనసాగించగల్గడం వంటివి సృజనాత్మక ఆలోచనల ప్రతిరూపం అని మరువకూడదు. ఏదో విధంగా కొత్త ఐడియాలతో, అభివృద్ధి శైలిలో ఉండేటట్లు ప్రతి విషయాన్ని చూపించగల్గడం సృజనాత్మకతే. దీనికి ఆలోచనతోపాటు ప్రదర్శనాశక్తి కూడా అవసరం. నమ్మకం ప్రధానమైనది.

దృష్టిలో ఉంచుకోవాలి!

♦ పనికి వచ్చే ఏ పనినైనా చేసేముందు దానిని మనం చేయగలం అనే నమ్మిక అవసరం ♦ అసాధ్యాలను సుసాధ్యాలు చేయడం ఎప్పుడూ సాధ్యమే! ♦ సృజనాత్మకతకు పునాది 'అది జరుగుతుంది' అనే నమ్మిక ♦ మీరు చెప్పేది కొత్తగా ఉంది. మరికొంత సమాచారం చెప్పండి' అని అడిగే వారి మనసు సృజనాత్మకతతో ఉంటుంది ♦ ఒక ఉదాహరణ... అరవయ్యోపడిలోకి ప్రవేశించిన ఒక వ్యక్తి కారు కొనుక్కున్నాడు. అతనికి డ్రైవింగ్ వచ్చు. కాని అతను నివశించే ప్రాంతం జనంతో చాలా రద్దీగా ఉంటుంది. అందువల్ల డ్రైవర్‌ను నియమించుకుని కారుమీద వెళ్లేవాడు. అతడు కారు డ్రైవ్ చేయడం అసాధ్యమని అతని నమ్మిక. డ్రైవర్ మీద ఆధారపడిన అతడు డ్రైవర్ రాకపోతే చాలా ఇబ్బంది పడేవాడు. ఒకసారి డ్రైవర్ రాలేదు. కాని ఆ వ్యక్తి ఆ రోజున తప్పనిసరిగా ఒక ప్రదేశానికి వెళ్లాల్సి ఉంది. పని వాయిదా వేయడం అతనికి ఇష్టం లేకపోయింది. అతనిలోని ధైర్యం అంతా కూడదీసుకుని ఆ రద్దీలో కారు డ్రైవ్ చేసుకుంటూ తన గమ్యస్థానానికి వెళ్లాడు. పని పూర్తి చేసుకుని తిరిగి వచ్చేశాడు. ఈ ఆత్మవిశ్వాసం ఆధారంగా రద్దీకి అలవాటు పడ్డాడు. డ్రైవర్ మీద ఆధారపడడం మానేశాడు. 'చేయలేము', 'చేయగలము' అనేదానికి అంత తేడా ఉంటుంది. ముఖ్యంగా యువత తమలోని సృజనాత్మకతకు ప్రాణం పోసుకోవాలి.

★

కన్నడ కథలు

కన్నడ ప్రముఖులు రాసిన 15 కథలను ఎంపికచేసి శాఖమూరి రామగోపాల్ తెలుగు అనువాదం చేశారు. కథావస్తువు ఇతరులదైనా దానిని తెలుగు అభిరుచులకు అనుగుణంగా ఆయన అనువదించారు. కన్నడ భాషలోని వైవిధ్య భరితమైన పదాలు, మాటలు చమత్కారంగా తెలుగు పాఠకులకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. భారతావనిలో కన్నడ భాషకు విశిష్టస్థానం వుంది. ఏడుగురు వ్యక్తులకు జ్ఞానపీఠ అవార్డు పొందిన ఘనత కన్నడభాషకే దక్కింది. 15 కథలలో తొలికథ "క్రిష్ణారెడ్డిగారి ఏనుగు". పూర్ణచంద్ర తేజస్వి రాసిన ఈ కథ మిగిలిన కథలన్నింటికంటే పెద్దది. రచయిత బమ్మెర పోతనవలె వ్యవసాయాన్నే వృత్తిగా చేసుకొని జీవించి రచనలు చేసినట్లు తెలుస్తున్నది. పైగా వీరి తండ్రి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత. 'మూడిగెరే' అనే చిన్న పట్టణంలో బీడుభూమిని కొని దాన్ని సుందరమైన సంపద భరితమైన తోటగా మలిచారు. ఈ కథకూడా మూడిగెరే పట్టణానికి సంబంధించినదే. కథలో గ్రామీణ జీవితంలోకి కొత్తగా ప్రవేశించిన అనేక వృత్తులు, మారిన పరిస్థితుల్లో దానినుంచి వస్తున్న ఇబ్బందులు రచయిత ప్రతిభావంతంగా వర్ణించారు. "ఒక్క రూపాయి కథ"లో బసవన్న రూపాయి దొంగతనంచేసి కుమిలిపోవడం, "మాయదారి మనసులోని మర్మం" కథలో తల్లీ బిడ్డల బాంధవ్యంలో వున్న విలువలు. "వ్యభిచారం" కథలో దొంగమార్కెట్‌దార్ల గురించి, "వరాహపురాణం" కథ ఎరుకల వారి యొక్క జీవన విధానాన్ని సమగ్రంగా వర్ణిస్తుంది. "ఫలితం" కథ ద్వారా మారుతున్న రాజకీయ పరిస్థితులను, "పగుళ్ళు" కథ ద్వారా గ్రామీణ జీవితంలోకి కొత్తగా జొరబడిన సాంప్రదాయాలను, "యాతన" కథ ద్వారా తల్లిదండ్రులను పోగొట్టుకున్న దురదృష్టవంతుని జీవితాన్ని, "వదులుకోవడం" కథలో ప్రాచీన సాంప్రదాయాలు ఏ విధంగా మారుతున్నాయో తెలుసుకోవచ్చు. "పాపం పిచ్చయ్య స్థితి" పిల్లలకోసం ఇద్దరు భార్యలను కట్టుకున్న పరిస్థితిని. "వైరాగ్యంలో మహిమ" కథలో స్వాములు, బాబాలు చేస్తున్న అక్రమాలను చెప్పడం జరిగింది. కన్నడ భాషలోని నిష్ణాతులైన రచనల నుండి ఎంపిక చేయబడ్డ కథలు కాబట్టి సహజంగానే కన్నడ రాష్ట్రంలోని జీవన పరిస్థితులను, ఆచార వ్యవహారాలను, సాంప్రదాయాలను అనేక రకాల కోణాలలో మనముందు వుంచే ప్రయత్నం "క్రిష్ణారెడ్డి ఏనుగు" సంకలనం ద్వారా శాఖమూరి రామగోపాల్ మంచి ప్రయత్నం చేశారు.

క్రిష్ణారెడ్డిగారి ఏనుగు (కథా సంకలనం), తెలుగు అనువాదం : శాఖమూరి రామగోపాల్, ప్రచురణ : అభిజాత్య కన్నడ, తెలుగు భాషా సంసోధనా కేంద్రం. వెల : రూ. 100/-.

- కారుసాల

కొత్త పుస్తకాలు

భిన్న మనస్తత్త్వాల వేదిక

మనదేశంలో కట్టుబాట్లు మనిషిని నిరంతరం నిర్దేశిస్తూనే ఉంటాయి. 'సంప్రదాయ సమాజం' వాటిని పాటించమని నిర్విరామంగా గుర్తుచేస్తూనే ఉంటుంది. ఆచారవ్యవహారాలు, పద్ధతి పడికట్లు కొన్నిసార్లు సక్రమమార్గంలో నడవడానికి దోహదపడినా, ఎక్కువసార్లు మాత్రం మనిషి పురోగతికి అవరోధాలుగా అడ్డుపడతాయి. అలాంటి సమయాల్లో సరైన నిర్ణయం తీసుకోవడంలోనే మనిషి వివేచన, విచక్షణ బైటపడతాయి. ఆపాటి విజ్ఞత ఉంటే చాలు, వ్యక్తిత్వం విరాజిల్లుతుంది. సంప్రదాయాలకు, పరిస్థితులకు మధ్య నలిగే మనుషుల చిత్రణ 'విడీవిడని చిక్కులు' నవల.

రచయిత వీరాజీ పాఠకులకు సుపరిచితులే. జర్నలిస్టుగా మొదలైన ఆయన ప్రస్థానం రచయితగా, కాలమిస్టుగా అవార్డులను అందుకునేలా చేసింది. ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ధారావాహికగా వచ్చిన 'విడీవిడని చిక్కులు' నేడు నవల రూపంలో పుస్తకప్రపంచంలోకి అడుగుపెట్టింది. వీరాజీ కథ నడిపిన తీరు విలక్షణమైనది. ఎనభైలనాటి తీరుతెన్నులు, మనస్తత్వాలు, భావాలను సహజంగానే అక్షరబద్ధంచేశారు. ఈ నవలలోని ముద్దులొలికే ముద్దరాలు రాజ్యలక్ష్మి, నాగరికతకు ప్రతిబింబం మీనాక్షి, అటూఇటూ డోలాయమానంలో ఊగులాడే సూర్యం, సంప్రదాయాలకు ప్రతీక నరసమ్మ, ఆటంకాల నడుమ తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకునే నిర్మల... ఇలా ఒక్కొక్క పాత్రనూ విశ్లేషించిన విధానం బాగుంది. బామ్మచాటు మనుమడు, ఒకే లోగిలిలో పది కాపురాలు, మడి ఆచారాలు, స్వార్థపరుడైన మేనమామ, సవతితల్లి వేధింపులు... ఇవన్నీ ఈ నవలలోని అంతర్భాగాలు. కాకుంటే కథాకాలం నాటికీ, నేటికీ సమాజంలో అనేక మార్పులు సంభవించాయి. ఆ తేడా భాషాపరంగా కూడా ఈ నవలలో కనిపిస్తుంది. ఏదేమైనా భిన్న మనస్తత్వాల సంఘర్షణే వీరాజీ నవలారూపమని చెప్పొచ్చు.

విడీవిడని చిక్కులు, పేజీలు : 133, వెల : 50/-, ప్రచురణలకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ బుక్‌హౌస్‌లు.

- కె. అరుణ

సృజనకర్త శంఖారావం

దుర్గానంద్

పేజీలు : 69,

వెల : 30/-,

ప్రతులకు:

కిరణ్‌బాబు, 7-డి,

సోమా ఎన్‌క్లైవ్,

దీన్ దయాల్ నగర్, నేరేడ్‌మెట్,

హైదరాబాద్.

మహమ్మారి మద్యం

గడ్డిపాటి కోటేశ్వరరావు

పేజీలు : 134,

వెల : 20/-,

ప్రతులకు:

ప్రజాశక్తి బుక్‌హౌస్

మరియు

అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు.



రకరకాల విన్యాసాలు

ఇప్పుడు మనం చెప్పుకోబోయే పక్షి పేరు వెల్లకంటి. ఈ పక్షులు ఆకుపచ్చ, పసుపు కలిసిన రంగులో ఉంటాయి. వీటి తోక చతురస్రాకారంలో ఉంటుంది. కళ్లచుట్టూ తెల్లటి వలయం స్పష్టంగా కనిపిస్తుంది. సన్నటి ముక్కు కొనదేరి కొంచెం వంగినట్లు కనిపిస్తుంది. ఇవి చిన్న చిన్న గుంపులుగా జీవిస్తాయి. అంటే ఒక్కో గుంపులో 10 నుండి 20 పక్షులు మాత్రమే ఉంటాయి. చెట్ల ఆకుల మధ్య, పొదల్లో వాటికి కావలసిన ఆహారాన్ని వెతుక్కుంటాయి. ఆహారం వేటాడే ప్రయత్నంలో అనేక రకాల విన్యాసాలు ప్రదర్శిస్తాయి. వీటి ముఖ్య ఆహారం కీటకాలు, పురుగులు. అంతే కాదు బాగా మగ్గిన పండ్లను కూడా ఇష్టంగానే తింటాయి. ఇవి గూళ్లను భూమికి రెండు మూడు మీటర్ల ఎత్తులో, పొదల్లో కడతాయి. గూడు కట్టుకునే సమయంలో మాత్రం గుంపుగా కాక విడివిడిగానే ఉంటాయి. ఆ సమయంలో మగ పక్షులు శ్రావ్యంగా పాటలు పాడతాయి. ఈ పాట చిన్నగా మొదలై చాలా బిగ్గరగా వినిపిస్తుంది. తీరా చూస్తే పాట మొత్తం కూడా మూడు నాలుగు సెకన్లు కూడా ఉండదు. ఇవి చాలా త్వరగా మచ్చికౌతాయి.



బాలనేస్తాలు

వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి?



చెప్పుకోండి

హాయ్... పక్కనున్న పిడుగు ఎవరో తెలుసా? మీకు చిన్న క్లూ. ఇతనో పెద్ద బాలీవుడ్ స్టార్. కాకపోతే చిన్ననాటి ఫొటో ఇది. ఇప్పుడు చెప్పండి ఇతను ఎవరో?

జవాబు : అమీర్ ఖాన్

సరైన వాదన

ముగ్గురు అన్నదమ్ములు స్కూలు నుండి ఇంటికి వెళ్తున్నారు. బస్సు ఎక్కుదామని రోడ్డుమీదకు వచ్చారు. అరగంట నుంచున్నా ఒక్క బస్సూ రాలేదు. ముగ్గురిలో "చిన్నవాడు నడుస్తూ వేళ్దాం. మధ్యలో ఎక్కడ బస్సు కనపడితే అక్కడ ఎక్కేద్దాం అన్నాడు. రెండోవాడు వెనక్కి వెళ్తే వచ్చే బస్సుని ముందుగానే ఎక్కొచ్చు కదా అన్నాడు. పెద్దోడు ఇక్కడే ఉండి బస్సు ఎక్కుదాం అన్నాడు. కానీ పెద్దోడి మాట మిగిలిన ఇద్దరూ వినలేదు. రెండోవాడు వెనక్కి, మూడోవాడు ముందుకి వెళ్లారు. పెద్దోడు మాత్రం అక్కడే ఉండి వచ్చిన బస్సు ఎక్కాడు. వీరి ముగ్గురిలో ఎవరు ముందుగా ఇల్లు చేరుకుంటారు. ఎవరి వాదన సరైంది.



జవాబు : ముగ్గురు అన్నదమ్ములు ఒకేసారి ఇల్లు చేరారు. ఎలా అంటే వారు ముగ్గురు ఒకే బస్సు ఎక్కారు. పెద్దవాడి వాదనే సరైంది. ఎందుకంటే ఉన్న చోటే నిలబడి వచ్చిన బస్సు ఎక్కాడు. రెండోవాడు వెనక్కి నడిచి, మూడోవాడు ముందుకి నడిచి అదే బస్సెక్కారు.





9 తేడాలు ఏవి?

పిడుగులూ! పై రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా వున్నాయి. కానీ అందులో 9 తేడాలున్నాయి. వాటిని గుర్తించండి.

దారి ఏది?

చిన్నారులూ...! స్వీటీ షికారుకెళ్లాలని అనుకుంది. వెంటనే చెప్పులు వేసుకుందామని చూస్తే ఒక చెప్పే కనిపించింది. రెండో చెప్పు అక్కడ లేదు. తీరా చూస్తే అది చాలా దూరంలో ఉంది. అక్కడికెళ్లాలంటే మధ్యలోగజిబిజి దారులున్నాయి. వాటిలో వాటిలో ఏ దారిగుండా వెళ్తే త్వరగా చెప్పును చేరుకోగలుగుతుందో చెప్పండి.





టి. నిఖిల,
హైదరాబాద్.

కనిపెడతారా!

నేస్తాలూ...కింది బొమ్మలో కొన్ని వస్తువులు, తినుబండారాలు, పక్షులు, జంతువులు ఉన్నాయి.అవి ఎక్కడున్నాయో వెతికి పట్టుకోవాలి. వాటిలో ఎన్ని ఎక్కువ వెతికి పట్టుకుంటే అన్ని మార్కులు వచ్చినట్లు. మరి త్వరపడండీ!

స్వేచ్ఛ విలువ

ఒకసారి ఒక యుద్ధంలో ఒక బ్రిటీష్ సైనికుడు బందీగా పట్టుబడ్డాడు. అతనికి చాలా సంవత్సరాల జైలు శిక్ష పడింది. అతడా జైలులో ఒంటరిగా గడిపేవాడు. మాట్లాడ్డానికి జైలు అధికారులు తప్ప మిత్రులంటూ ఎవరూ లేరు. అతడు బయటి ప్రపంచంలోని అందమైన జీవితాన్ని కోల్పోయాడు.

చాలా సంవత్సరాల తర్వాత అతడు విడుదలయ్యే రోజు వచ్చింది. అధికారులు అతనికి కొంత డబ్బు, రెండు జతల బట్టలు ఇచ్చి విడుదల చేశారు. ఇప్పుడతడు స్వేచ్ఛాజీవి. అతడు లండన్‌కు బయలుదేరాడు. అలా వెళ్తుండగా దారిలో అతనికి పక్షులు అమ్మే వ్యక్తి దుకాణం కనిపించింది. అక్కడ రకరకాల పక్షులు పంజరాల్లో బంధింపబడి వున్నాయి. తన దగ్గర వున్న డబ్బులతో ఆ పక్షులన్నింటినీ కొని, పంజరాలు తెరిచి వాటిని వదిలిపెట్టాడు. అవి స్వేచ్ఛగా రెక్కలు ఆడించుకుంటూ ఆకాశంలోకి ఎగిరిపోయాయి. ఒంటరిగా, బందీగా వుండడం ఎంత నరకప్రాయమో అతనికి బాగా తెలుసు మరి.

- మేకల మదన్‌మోహన్



మాటల కోట - 60

రూపకల్పన : కర్లపాలెం

1		■	2	3		■	4	5
	■	6			■	■	■	
7	8	■		■	9	■	10	
■	11	12		13		14		■
15	■		■		■		■	16
17	18	■	19	■	■	■	20	
■	21	22	■	23	■	24		■
25	■	26			27		■	28
29		■	■	30		■	31	

అడ్డం :

1. పాలలోని భాగం (2)
2. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు (3)
4. భూమిలోని పిల్ల తాడి చెట్టు (2)
6. పెళ్లికాని అమ్మాయి (3)
7. నిక్కరు (2)
10. హిందీలోనే -'కానీ'! (2)
11. సప్తస్వరాలు (7)
17. కూలికి పని చేసేవాడు (2)
19. 'కయి కది' కప కభా కష? (1)
20. తెలంగాణా ఆడబిడ్డ (2)
21. హెచ్చైవీ వంటి వ్యాధుల నివారణకు పని చేసే వర్కర్స్ (2)
24. గూఢచారి (2)
26. విష్ణుశర్మ జంతువులు పాత్రలుగా చెప్పిన కథలు (5)
29. సువాసన, శుభకార్యాలలో స్త్రీలు గొంతులకు పులుముకునేది(2)
30. పాట (2)
31. పొదుపు (2)

నిలువు :

1. ఇటీవల మరణించిన చారానా (3)
2. 'ఆగమాగం'ఆగమాగమయింది (4)
3. ముందుచూసుకో... పడతావు! (2)
5. ప్రజాగాయకుడు (3)
8. సగం గుస గుస (2)
9. పాలగుమ్మి పద్మరాజు పొట్టిపేరు (2)
10. 'పదనిస'లోని కార్యము (2)
12. చరితములో చెదిరిన సినిమాతార (2)
13. నెమ్మదిగా చూడు మనసు కనపడుతుంది (2)
14. ధైర్యం (2)
15. జపాను మినీ కవిత (2)
16. ఆషాఢంలో జగన్నాథుడు ఊరేగేదీ ఊరిలోనే (2)
18. తిరగబడిన భార్య (2)
20. చంద్రుడికో నూలు-- (2)
22. కోపంవస్తే మునులు పెట్టేది (2)
23. చెదిరిపోయిన 'తంగేడు' (3)
24. తినగ తినగ ఇది తీయగానే ఉంటుంది (2)
25. సినిమారంగంలోని కొత్త సినిమా (2)
27. ముగ్గురు (2)
28. అధికారస్థాయి (2)

మాటలకోట - 59 జవాబు

■	1 త	2 లా	రి	■	3 ర	4 మ	ణ	■
5 క	■	భం	■	6 ప్ర	■	క్కా	■	7 సో
8 వి	ద్య	■	9 ప్రా	ణ	ము	■	10 మౌ	ని
త	■	11 మ	■	భ్	■	12 కు	■	యా
■	13 ల	గ్గ	ము	■	14 గె	లు	పు	■
15 మ	కా	ము	■	16 పం	■	కు	■	17 లో
18 క	రం	■	19 మె	తు	కు	■	20 ఆ	సు
రి	■	21 న	క	లు	■	22 గి	■	గు
■	23 ఉ	డు	ము	■	24 అం	జ	లి	■

20 ప్రశ్నలు

మహేంద్రవర్మ మగధదేశ రాకుమారుడు. ఒకసారి అతను దేశ సంచారానికి బయలుదేరాడు. అడవులు, కొండలు, గుట్టలు, ఊళ్ళు దాటుతూ సముద్ర తీరంలో ఉన్న ఓ నగరానికి చేరుకున్నాడు. రాజవీధి గుండా వెళుతూ ఓ రత్నాల అంగడి ముందు ఆగాడు. హఠాత్తుగా రాజుగారి పట్టపుటేనుగు అక్కడికి వచ్చి పూలమాలను అతడి మెడలో వేసింది.

రాజభటులు మహేంద్రవర్మను ఏనుగు మీద ఎక్కించి ఆర్భాటంగా రాజమందిరానికి తీసుకెళ్లారు. అంబారి వెనుకే ప్రజలు జయజయధ్వానాలు చేసుకుంటూ వెళ్లారు. ఒక శుభ మూహూర్తంలో ఆ దేశ రాజుగా మహేంద్రవర్మకు పట్టాభిషేకం జరిగింది.

రాజుగారి మంత్రి మండలిలో దుష్టబుద్ధి అనే మంత్రికి ఎప్పటి నుంచో రాజు కావాలనే కోరిక ఉంది. అయితే హఠాత్తుగా మహేంద్రవర్మ రాజు కావటాన్ని అతను సహించలేకపోయాడు. అసూయతో రగిలిపోయాడు.

ఓసారి రాజ సభలో అందరి సమక్షంలో మహేంద్రవర్మతో- "ఏనుగు పూలమాల వేయటం వల్ల నువ్వు రాజువయ్యావు. అది గొప్పతనం కాదు. ఇరవై ప్రశ్నలు అడిగే రాకుమారిని గెలిచి, పెళ్లి చేసుకుని వస్తే అప్పుడు నీవు ఈ దేశానికి తగిన రాజువని అంగీకరిస్తాను" అన్నాడు.

రాకుమారుడికి దుష్టబుద్ధి మాటలు శూలాలతో గుచ్చినట్లు అనిపించింది. "రాకుమార్తెను గెలుచుకుని, పెళ్లాడి, రాజ్యానికి తిరిగొస్తాను. ఒక వేళ రాకుమారి దగ్గర ఓడిపోతే తిరిగిరాను" అని చెప్పి ముఖ్యమంత్రికి రాజ్యభారాన్ని అప్పగించి ఇరవై ప్రశ్నల రాకుమారి కోసం బయలుదేరాడు.

రెండు రోజుల సుదీర్ఘ ప్రయాణం తరువాత రాకుమారుడు ఇరవై ప్రశ్నల రాకుమారి ఉండే ద్వీపాన్ని చేరుకున్నాడు. రాజభవనం ముందు రాకుమార్తె ఏర్పాటు చేయించిన నగారాను మోగించాడు. ఆ శబ్దం వినగానే రాజభటులు వచ్చి మహేంద్రవర్మను సభకు తీసుకెళ్లారు. రాకుమారి వచ్చి సభలో తెరచాటున కూర్చుంది. తెరలోంచి కనిపిస్తున్న రాకుమారిని చూసి మహేంద్రవర్మ ఆశ్చర్యపోయాడు. అపురూప సౌందర్యవతి అయిన ఆ రాకుమారిని పెళ్లాడని జీవితం వృధా అనుకున్నాడు.

సభలోని వారంతా అతడ్ని పరిహాసంగా, జాలిగా చూశారు. అందుకు కారణం రాజకుమారిని పెళ్లాడదలచిన వారు ఆమె అడిగే కష్టమైన ఇరవై ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. జవాబులు చెప్పలేనివారు ఆమె గుర్రపు శాలలో పనిచేయాలి. అది షరతు. ఇప్పటిదాకా సరైన సమాధానాలు చెప్పినవారు ఎవరూ లేరు.

యధాప్రకారం రాజకుమారి ప్రశ్నలు అడగటానికి ముందు తన షరతును తెలిపింది. అందుకు మహేంద్రవర్మ అంగీకరించాడు.

"ఒకటి అంటే ఏమిటి?" రాజకుమారి అడిగింది.

"మనుషులంతా ఒక్కటే అని అర్థం" అన్నాడు మహేంద్రవర్మ

"రెండు అంటే ఏమిటి?"

"భూమి మరియు ఆకాశం అని అర్థం"

"మూడు అంటే?"

"మూడు లోకాలు అని అర్థం"

"నాలుగు అంటే ఏమిటి?"

"నాలుగు దిక్కులు"

"ఐదు అంటే ఏమిటి?"

"పంచభూతాలు"

"ఆరు అంటే?"

"ఆరు రుతువులు అని అర్థం"

"ఏడు అంటే?"

"సప్త సముద్రాలు అని అర్థం రాకుమారి"

"ఎనిమిది అంటే ఏమిటి?"

"అష్టసిద్ధులు"

"తొమ్మిది అంటే ఏమిటి?"

"నవగ్రహాలు"

"పది అంటే ఏమిటి"

"దశావతారాలు"

"పదకొండు అంటే?"

"అగ్ని జ్వాలలు పదకొండు అని అర్థం"

"పన్నెండు అంటే?"

"పన్నెండు మంది సూర్యులు"

"పదమూడు అంటే ఏమిటి?"

"అది జూదరి అదృష్ట సంఖ్య"

"పద్నాలుగు అంటే?"

"పద్నాలుగు రకాల రత్నాలు"

"పదిహేను అంటే ఏమిటి?"

"పక్షంలోని రోజుల సంఖ్య"

"పదహారు అంటే?"

"చంద్రుడివి పదహారు కళలు"

"పదిహేడు అంటే ఏమిటి?"

"పదిహేడు మంది మంత్రులతో రాజాస్థానం శోభిస్తుంది"

"పద్దెనిమిది అంటే?"

"పద్దెనిమిది రకాల కందమూలాలు"

"పంతొమ్మిది అంటే?"

"నాకు పంతొమ్మిది నీకు ఇరవై. ఇక పెళ్లికి సిద్ధం అని మీ భావం రాకుమారి" అన్నాడు మహేంద్రవర్మ నవ్వుతూ.

సభికులు కరతాళధ్వనులతో సంతోషాన్ని ప్రదర్శించారు. రాకుమారి తన ఆసనం నుంచి లేచి సిగ్గుపడుతూ పూలహారం తెచ్చి అతడి మెడలో వేసింది.

మహేంద్రవర్మ రాజకుమారిని తీసుకుని మగధకు తిరిగొచ్చి చాలాకాలం రాజ్యాన్ని ప్రజారంజకంగా పాలించాడు.

- రంగనాథ రామచంద్రరావు

పాదరక్షలే...

ఎప్పుడూ చెప్పుకునేదే అయినా తప్పడం లేదు. ఆ పనిని అప్పటి వరకు ఎందరో చేసి వుంటారు. ఇకపైన కూడా మరెందరో చేస్తారు. కానీ కొందరికే కొత్త ఆలోచన పుడుతుంది. ఈ భూమి మీద ఎన్నో వేల సంవత్సరాలుగా బూట్లు, చెప్పులు వాడుతున్నాం. కానీ ఇలాంటివాటిని ఎప్పుడైనా చూశారా! ఊ...హూ... నిచ్చెనలు, అరటిపండు తొక్కలు, పక్షి ముక్కులు, పప్పీ తలలు, పాప తలలు, ఇనుప చువ్వలు, పక్షులు-ఉడుతలను కొట్టే కర్రలు (గులేర్) ... ఉపయోగించి ఎత్తు చెప్పులు తయారు చేసేశాడో కళాకారుడు. ఈయనగారికి ఇలాంటి వెరైటీ పాదరక్షలు, బూట్లు సృజించడమంటే మహా ఇష్టమట. తోచిన విధంగా చేసేశాడు. కాకపోతే వీటిని వేసుకుని నడిచే వారే కూసింత జాగ్రత్త పడాలి. ఏ మాత్రం అటూ ఇటూ అయ్యిందో... అయ్యిందే అమ్మాయిగారి పని. ఏదేమైనా ఆర్టిస్టు సృజనాత్మకతను అభినందించాల్సిందే.